Crime Mirror QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
27-10-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 353

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

### అన్నికేసులపైనా విచారణ సాగుతున్నాయి

అవినీతి నేతలను ఎవ్వరినీ వదిలే ప్రసక్తి లేదు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంది

కేబినేట్ విస్తరణ అధిష్ఠానం, సిఎం చూస్తారు

త్వరలోనే పార్టీ పునర్వ్యవస్థీకరణ చేపడతాం

మీడియాతో ఇష్టాగోష్ఠిలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారని ప్రపంచానికంతా తెలిసిందని, అందుకే కెసిఆర్ కుటుంబ అవినీతిపై చర్యలకు సర్వత్రా డిమాండ్ పెరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

- మిగతా 2వ పేజీలో

# సన్నవడ్లకు రూ.500 బోనస్ వర్తింపు

### ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు.. మెట్రో మార్గాల విస్తరణకు ఆమోదం



ఉద్యోగులకు రెండు డిఎల చెల్లింపు

ములుగులో గిరిజన వర్సిటీకి211 ఎకరాల భూమి

గోషామహల్‌లో ఉస్మానియా నిర్మాణం

పలు నిర్ణయాలకు కేబినేట్ ఆమోదం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సన్న వడ్లకు రూ.500 బోనస్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే ధాన్యం సేకరణకేంద్రాల ఏర్పాటకు మంత్రిమండలి ఆమోదించింది. అలాగే మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగోల్, ఎల్‌బి ఆనగర్, హయత్‌నగర్,శంషాబాద్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల హామీలు సహా మేనిఫెస్టోపై చర్చించింది. ఇప్పటివరకూ వేసిన కేబినెట్ సబ్ కమిటీలు, వాటి నివేదికలపై చర్చించింది. ములుగు జిల్లాలో సమ్మక్క సారలమ్మ సెంట్రల్ వర్శిటీకి ఎకరానికి రూ.250 చొప్పున భూమిని కేటాయించాలని నిర్ణయించింది. అలాగే, మద్దూర్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయడానికి ఆమోదం తెలిపింది. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంపుపైనా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రేరాలో 54 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీకి ఆదేశాలిచ్చింది. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మిగతా 2లో



## నిన్న భార్యలు, ఇవాళ ఏకంగా పోలీసులు

వరంగల్ జిల్లా మామునూరులో రోడ్డెక్కిన ఖాకీలు

నల్లగొండ జిల్లా అన్నెపర్తిలోనూ పోలీసుల ఆందోళన

ఇబ్రహీంపట్నం, మంచిర్యాలలో ఫ్యామిలీల ధర్నా

ఆందోళనలతో మిన్నంటుతున్న బెటాలియన్లు

వరుస నిరసనలతో పోలీసుశాఖ ఉక్కిరి బిక్కిరి

మిగతా 2లో



### వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి

## నీళ్లు తాగే వ్యక్తి

ఆస్తులకు వారి పేర్లు పెట్టుకుంటే వారివే అవతాయా?

మేము ఆనాడు అభ్యంతరం చెప్పలేదు కనుకే పేర్లు వచ్చాయి

తల్లిని కోర్టుకు ఈడ్చే కొడుకు ఉంటాడా..

ఇది ఘర ఘర్‌కీకహానీ ఎలా అవుతుంది

మీడియా సమావేశంలో షర్మిల కన్నీటి పర్యంతం

## జగన్ హయాంలోనే విద్యుత్ భారానికి ఆమోదం

### రూ. 11,826 కోట్ల భారం పడుతోంది

విద్యుత్ కొనుగోళ్లలో క్విడ్‌ప్రోకో జరిగింది

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమర్



**విజయవాడ (క్రైమ్ మిర్రర్):** వైసీపీ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో జగన్ క్విడ్ ప్రోకో విధానం ద్వారా వచ్చిన సొమ్మును వైఎస్ జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారని ఏపీ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమర్ ఆరోపించారు. ఐదేళ్లలో జరిపిన విద్యుత్ కొనుగోళ్లలో జగన్ ప్రభుత్వం పారదర్శకత పాటించలేదని విమర్శించారు. జగన్, పెద్దిరెడ్డి బొగ్గు కొనుగోళ్ల వ్యవహారం రహస్యంగా నడిపించారని పేర్కొన్నారు.



## కొడంగల్ నుంచే రేవంత్ పతనం

### కాంగ్రెస్ నేతలు పలువురు బిఆర్ఎస్‌లో చేరిక

### తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ఇలాఖాలో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం పర్యటనలో ఉండగానే.. సొంత పార్టీకి చెందిన పలువురు నేతలు సీఎంకు షాకిచ్చారు. పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## తెలంగాణలో ఎక్కడా మంచినీటి సమస్య రావద్దు

స్వచ్ఛమైన మంచి నీటినే సరఫరా చేయండి

మిషన్ భగీరథ నిర్వహణలో లోపాలు రాకూడదు

అధికారులతో సమీక్షలో మంత్రి సీతక్క ఆదేశాలు

## తెలంగాణలో ఎక్కడా మంచినీటి సమస్య రావద్దు

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్య రానీయ కూడదని మంత్రి సీతక్క ఆదేశించారు. శుద్ధి చేసిన నీరే సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. కోట్లాదిమంది ప్రాణాలు మిషన్ భగీరథ సిబ్బంది చేతిలో ఉన్నాయని.. అందుకే అధికారులు అంతా బాధ్యతతో పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వేసవికాలంలో నీటి ఎద్దడి ఉన్నా ఎలాంటి సమస్య లేకుండా తాగునీటిని అందించామని స్పష్టం చేశారు. 13456 మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చామని గుర్తుచేశారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లాల వారీగా అధికారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, తదితరులు

హాజరయ్యారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... రిజర్వాయర్లలో సరిపోయినంత నీటి నిల్వలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లోకల్ సోర్స్‌ల మీద దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి ఐదు, ఆరు నియోజకవర్గాలను ఒక యూనిట్‌గా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు వస్తున్నా ప్రజలు బోర్లు వేయించాలని, ఆర్వో ఎ÷-లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మిషన్ భగీరథపై వేల కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత బోర్ల మీద, ఆర్వో ప్లాంట్ల మీద ప్రజలు డిపెండ్ అవుతున్నారని అన్నారు. ఆ విధానం పోయేలా మిషన్ భగీరథ సిబ్బంది పని చేయాలి. మిషన్ భగీరథ నీళ్లపై ప్రజలకు నమ్మకం కలిగించాలి. ప్రతి గృహానికి నల్లా నీరు అందేలా చర్యలు చేపట్టాలి. మిషన్ భగీరథ ట్యాంకులను తరచూ శుభ్ర పరచాలి.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి పరులను ప్రభుత్వం వదలబోదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం డిజైన్ మార్చి వ్యయం పెంచారని ఆరోపించారు. కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టారని.. ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవకతవకలపై కమిషన్ విచారణ జరపుతోందని.. కాళేశ్వరం వాస్తవాలు బయటకు రావాలని అన్నారు. అన్యాయంగా ప్రభుత్వం ఎవరిపైన కేసులు పెట్టదని.. అదే విధంగా తప్పు చేసిన ఎవరినీ వదలదని హెచ్చరించారు. రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన కేబినెట్ విస్తరణపై గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. శనివారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీ, ముఖ్యమంత్రి కనుసన్నలలో జరుగుతుందని.. తాను పార్టీ వ్యవహారాలు మాత్రమే చూస్తున్నానని అన్నారు. కేబినెట్ విస్తరణ పార్టీ హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. త్వరలో పీసీసీ నూతన కార్యవర్గ నియామకం ఉంటుందని.. డీసీసీలుగా ఎమ్మెల్యేలతో పాటు సమర్థులకు కార్యవర్గంలో స్థానం ఉంటుందని అన్నారు. ఇతర పార్టీల నాయకుల చేరికలతో కొన్ని సమస్యలు తలెత్తాయని.. పాత కొత్త నేతలను సమన్వయం చేసుకోవాల్సి ఉందని అన్నారు. జీవన్ రెడ్డి సన్నిహితుడు మరణంతో మనస్తాపానికి లోనయ్యారని.. బాధతో ఆయన లేఖ రాశారన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడని.. ఆయనకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్రంలో పొలిటికల్ బాంబు పేలుతాయంటూ మంత్రి పొంగులేటి చేసిన కామెంట్స్ స్పందిస్తూ.. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారి గురించే పొంగులేటి మాట్లాడారని భావిస్తున్నానని అన్నారు. అక్కినేని ఫ్యామిలీ, సమంతపై కొండా సురేఖ మాటలను పార్టీ పరంగా సమర్థించమన్నారు. వెంటనే కొండా సురేఖ తన మాటలు ఉపసంహరించు కున్నారని గుర్తు చేశారు. రానున్న డిసెంబర్ నెలలో కొన్ని శుభవార్తలు వింటారని మహేష్ గౌడ్ అన్నారు. మరోవైపు.. 2029 ఎన్నికలు మాకు ఫైనల్ అని.. రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి ఉంటుందని తెలిపారు. బీసీ విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొంత డివియేట్ అవుతున్నారని.. ఆయనతో నేను, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ చార్జ్ దీపదాస్ మున్సి మాట్లాడామని.. అన్ని సర్దుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ కులగణనపై నవంబర్‌లో సమావేశాన్ని నిర్వహించాలని అనుకుంటున్నామని.. ఆ సమావేశానికి మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను ఆహ్వానించామని తెలిపారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని కుమార్ గౌడ్ అన్నారు. వారు చేసిన తప్పులకు కేసీఆర్, కేటీఆర్‌లను రెండు, మూడేళ్లుకాదని.. పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువేనని అన్నారు. అలాగే విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు చాలా తక్కువధరకే విద్యుత్ దొరుకుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన లేదని అన్నారు. కేసీఆర్‌కు ఉన్న ఆర్థిక వెసులుబాటు తమకు లేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంది, కానీ పదేళ్లలో రూ.8లక్షల కోట్లు కేసీఆర్ తెలంగాణపై అప్పు చేశారని విమర్శించారు. ఏ పథకాన్ని ఆపలేదు. త్వరలోనే పథకాలను గ్రౌండ్ చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో విడుతాల వారిగా చేసిన దానికంటే తాము రుణమాఫీ చేసిన మొత్తం ఎక్కువేనని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేసీఆర్ చేసిన అప్పులను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం, పథకాలను ఎగ్గొట్టాలనే ఆలోచన లేదని చెప్పారు. హైడ్రాలో ఒక్కటే పేదల ఇల్లు కూలిందని చెప్పారు. సోషల్ మీడియాలో అనైతికంగా ప్రచారం చేస్తున్నారు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతూ పట్టుకుందమంటే పట్టుకునే వీలు లేకుండా విదేశాల్లో ఉంటూ నడుపుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో యథేచ్ఛగా చెరువుల కబ్జా జరిగింది. వయనాడులో జరిగిన విధ్వంసం తెలంగాణలో జరగకూడదనే యుద్ధప్రాతిపదికన మూసీ ప్రక్షాళన చేపట్టామని వివరించారు. విడతల వారిగానే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. హైడ్రాతో పేదవారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటాం. హైడ్రా, మూసీపై రివ్యూ చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి అన్యాయం కలగకుండా చర్యలు ఉంటాయని అన్నారు. జీవో నెంబర్ 29పై ఎవరికి నష్టం జరుగదని అధికారులు చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో ఎవరికి అన్యాయం జరగడం లేదు. జీవో నెంబర్ 29పై ఎవరు ఆందోళన చేశారో, ఎందుకు చేశారో తెలియడం లేదన్నారు. నెలలు అవుతుంది, ప్రతిపక్ష నేత ఎక్కడికి పోయాడు. ప్రజల సమస్యలపై కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు.

# నిన్న భార్యలు, ఇవాళ ఏకంగా పోలీసులు



హైదరాబాద్: రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలంటూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ధన,మాన, ప్రాణాలు రక్షించాల్సిన పోలీసులే ఏకంగా రో÷-డడెక్కుతున్నారు. వరంగల్ జిల్లా మమూనూరు క్యాంపులో మొదలైన ఆందోళన సెక్రటేరియట్ చేరింది. క్రమంగా రాష్ట్రంలోని అన్ని బెటాలియన్లకు పాకుతోంది. అయితే ఇవాళ మామునూరు బెటాలియన్ ఆవరణలో ఏకంగా యూనిఫాం ధరించిన పోలీసులే నిరసనకు దిగారు. టీజీఎస్పీ వద్దు ఏక్ పోలీస్ ముద్దు, టీజీఎస్పీకో హఠావో.. ఏక్ పోలీస్ బనావో అంటూ నినాదాలు చేశారు. అటు నల్లగొండ జిల్లా అన్నెపర్తి బెటాలియన్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంపై కానిస్టేబుళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ రూరల్ ఎస్సై సైదాబాబును సస్పెండ్ చేయాలని నిరసనకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ కుటుంబ సభ్యుల మీద అసభ్యకరంగా నోటికి వచ్చినట్టు మాట్లాడారని ఆరోపించారు. తక్షణమే సైదా బాబుని సస్పెండ్ చేయాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అయితే బందోబస్తు విధుల్లో ఉన్న సైదాబాబు వద్దకు కానిస్టేబుళ్లు రావడంతో.. బెటాలియన్ అధికారులు అతడిని అక్కడిని నుంచి పంపించేశారు. ఏకంగా యూనిఫాంలో ఉన్న పోలీసులే ఆందోళనకు దిగడం హాట్ టాపిక్ గా మారింది. ఈ పరిణామం రాష్ట్ర పోలీసుశాఖను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. చాలా కాలంగా ఈ విధానం అమల్లోనే ఉన్నా.. ఇప్పుడే పోలీసులు ఎందుకు ఆందోళన చేస్తున్నారనే చర్చ మొదలైంది. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ల వద్ద ఇవాళ కూడా ఆందోళనలు చోటు చేసుకున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ... వ బెటాలియన్ వద్ద కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు ఆందోళన చేశాయి. అటు మంచిర్యాల జిల్లా గుడిపేట్ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జిపై ఆందోళనకు దిగాయి. బ్రిటీష్ కాలం నాటి మాన్యువల్ ఇప్పటికీ నడుస్తోందని, దానిని రద్దు చేయాలని, తమిళనాడు లాంటి సంస్కరణలు తీసుకు రావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీసు బెటాలియన్లు 13 ఉన్నాయి. ఒక్కో బెటాలియన్ లో సగటున 1,500 మంది విధులు నిర్వర్తిస్తారు. ఇందులో 200 మంది జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తారు. మిగతా 1300 మంది బెటాలియన్ పరిధిలోని పోలీసు స్టేషన్లలో రొటేషన్ గా మూడు నెలల పాటు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీళ్లు ఇలా అన్ని పోలీస్ స్టేషన్లకు రొటేట్ అవుతూ ఉంటారు. అంటే ఒక్కో కానిస్టేబుల్ ఏడాదిలో కనీసం మూడు పోలీసు స్టేషన్లకు తిరగాల్సి ఉంటుంది. ఇలా తిరగడం వల్ల తమ భర్తలు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారని కానిస్టేబుళ్ల భార్యలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఒక్క జిల్లాలో మూడు నుంచి ఐదేండ్ల పాటు పనిచేసేలా వెసులు బాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. మిగతా సివిల్ కానిస్టేబుళ్ల మాదిరిగానే తమకూ సెలవులు, బదిలీలు ఉండే విధానాన్ని తీసుకు రావాలని ఆ కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.

# సన్నవడ్లకు రూ.500 బోనస్ వర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఉస్మానియా ఆస్పత్రి పునఃనిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీపావళి పండుగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక డీఏ వచ్చే నెల వేతనంతో.. మరో డీఏ మార్చిలో ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. పండుగ వేళ పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీఏల విడుదలతో పాటు ఈ భేటీలో కేబినెట్ మరికొన్ని కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి ఎకరా రూ.250 చొప్పున 211 ఎకరాల భూమి కేటాయింపు, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయింపుకు మంత్రి మండలి ఒకే చెప్పింది. దీంతో పాటుగా.. ఏటూరు నాగారాన్ని రెవెన్యూ డివిజన్ చేస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. దీంతో ఏటూర్ నాగారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు బాణా సంచాలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఇదిలా వుంటే అటు, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక కొందరు కావాలనే విష ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి మండిపడ్డారు. నరెడ్కో నిర్వహిస్తోన్న ప్రాపర్టీ షోను శనివారం ఆయన సందర్శించారు. మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితాన్ని ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. నిర్వాసితులకు వారు ఉండే చోట అద్భుతమైన టవర్స్ నిర్మించి.. వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని తెలిపారు. మూసీ నిర్వాసిత మహిళలతో పాటు నగరంలోని డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. మరోవైపు, స్థిరాస్తి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్యాంకర్లతో చర్చించి వారికి రుణాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హైడ్రాపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కొడంగల్ నుంచే రేవంత్ పతనం

సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ దయాకర్ రెడ్డితోపాటు.. బీఎస్పీ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన నర్మద బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దాదాపు వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు కూడా కారెక్కారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ మాజీ ఎంపీపీ, బీఎస్పీ కాంటెస్టెడ్ క్యాండిడేట్ నర్మదా, పలువురు కాంగ్రెస్ నాయకులు కారెక్కారు. వీరందరికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించే దిశగా పని చేస్తామని నేతలు పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి మోసం చేశారని వారు ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీని రేవంత్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిం చారని, అధికారంలోకి వచ్చిన తరువాత కొడంగల్‌లోనే ఫార్మా కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొడంగల్ నియోజకవర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికను పక్కన పెట్టారని.. కేవలం కమీషన్ల కోసం కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును చేపట్టారని ఆరోపించారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు పలు వర్గాల ఆందోళనలు, ధర్నాలతో తెలంగాణ అట్టుడుకుతోందని, మంత్రులు మాత్రం విహార యాత్రల్లో ఎంజాయ్ చేస్తున్నారని మండిపడ్డారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు ప్రగతిపథంలో పరుగులు పెట్టిన తెలంగాణ రాష్ట్ర ఆదాయం తగ్గుతోందని, కాంగ్రెస్ నేతల ఆదాయం మాత్రం పెరుగుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టర్ ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో తరిస్తోందని, ఇది అధికార దుర్వినియోగం కాకపోతే మరేంటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కలిసికట్టుగా పనిచేసి కొడంగల్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

# జగన్ హయాంలోనే విద్యుత్ భారానికి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఏపీలో ఇంధన సర్దుబాటు ఛార్జీల వసూళ్లకు జగనే అనుమతి ఇచ్చారని వెల్లడించారు. ఆయన అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రస్తుతం ప్రజల మీద బారం పడుతుందని వివరించారు. ఏపీ జెన్‌కోను నిర్వీర్యం చేశారని, ప్రజావసరాల కోసం ఇష్టారాజ్యంగా ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోళ్లు చేశారని మండిపడ్డారు. జగన్ కారణంగా ప్రస్తుతం ఏపీ ప్రజల మీద 2023-24 సంవత్సరానికి మరో రూ. 11,826 కోట్ల భారం పడుతుందని వెల్లడించారు. జగన్ హయాంలోనే డిస్కంలు వసూళ్లకు అనుమతి కోరాయని తెలిపారు. వాయిదా వేస్తూ, కమిషన్ ముగిసే మూడు రోజుల ముందుగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారన్నారు. జగన్ చేసిన పాపాలే ప్రజల మెడకు ఉరితాళ్లని దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రస్తుతం ప్రజల మీద విద్యుత్ ఛార్జీల భారం పడుతోందని వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తికి మారుపేరైన ఏపీ జెన్‌కోను నిర్వీర్యం చేసి.. ప్రజావసరాల కోసం అనే పేరుతో యథేచ్ఛగా ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోళ్లు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో జరిపిన విద్యుత్ కొనుగోళ్లలో జగన్ సర్కారు ఎక్కడా పారదర్శకత పాటించలేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. విద్యుత్ కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో విధానం ద్వారా వచ్చిన సొమ్మును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారని ఆరోపించారు. జగన్, పెద్దిరెడ్డి బొగ్గు కొనుగోళ్ల వ్యవహారం అంతా రహస్యంగానే నడిపించారన్నారు. జగన్ బరితెగింపు దోపిడీ కారణంగా గత పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. జగన్ చేసిన పాపాల కారణంగా ప్రస్తుతం ఏపీ ప్రజల మీద 2023-24 సంవత్సరానికి మరో రూ.11,826.42 కోట్ల భారం పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి ఓర్వలేక సాక్షి పత్రికలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతినీళ్లు తాగే వ్యక్తి

(మొదటి పేజీ తరువాయి)

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. అన్ని కుటుంబాల్లో ఉంటే వ్యవహారం అంటూ తమఆస్తులపై జగన్ చేసిన వ్యాఖ్యలపై షర్మిల మండిపడ్డారు. తల్లిపై కేసులు పెట్టి కోర్టుకు లాగడం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమోషన్‌కు గురైన షర్మిల కన్నీటి పర్యంత అయ్యారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుబ్బారెడ్డి వ్యాఖ్యపై స్పందించారు. ‘న బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు.. వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది. అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయి ఎందుకిలా మాట్లాడుతున్నారు‘ అని కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు.. ఆయన అలా మాట్లాడకపోతే ఇంకెలా మాట్లాడుతారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారు. సుబ్బారెడ్డే కాదు.. సాయిరెడ్డి కూడా అలాగే మాట్లాడొచ్చు. ఎందుకంటే ఆయన కూడా వాళ్ల టీమ్‌లోనే ఉన్నారు. జగన్ పక్కన వాళ్లు ఉన్నారని తెలిసి కూడా నిన్న రాసిన లేఖలో వాళ్ల పేర్లు ప్రస్తావించాను. నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి చెబుతున్నది కూడా నిజమని ఆయన ప్రమాణం చేయగలరా? నలుగురు మనవళ్లకు ఆస్తిలో సమాన వాటా అని రాజశేఖర్‌రెడ్డి బ్రతికుండగానే చెప్పారు. ఇది నిజం.. నా బిడ్డలమీద ప్రమాణం చేసి చెబుతున్నా. ఇది నిజం కాదని.. సుబ్బారెడ్డి, జగన్ ఇద్దరూ వారి బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా? నాకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా? నా మేలు కోరతానని వైఎస్‌కు జగన్ మాట ఇచ్చారు. సాక్షిలో, భారతి సిమెంట్స్‌లో వాటాలు మావని జగన్ ఎలా చెబుతారు? కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆరోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం.. రాజశేఖర్‌రెడ్డి అనుమతిచ్చారు, నేను అడ్డు చెప్పలేదు కాబట్టే. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వారివే అనే రూల్ ఏమైనా ఉందా? ఆస్తులు మొత్తం జగన్‌వే కాబట్టి ఆయన జైలుకు వెళ్లారని సుబ్బారెడ్డి చెబుతున్నారు. భారతి పేరు మీద ఆస్తులు ఉంటే ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు? ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా? మీరు ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అర్థం. దీనికి సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. కన్నతల్లిపై కేసు వేసిన వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా? ఇలాంటి గొడవలు అందరి ఇళ్లలో ఉండేవే అని అని సునాయాసంగా మాట్లాడుతున్నారు. మీకు మానవత్వం లేదా?ఎవరో మాట్లాడితే బాధపడేదాన్ని కాదు.. సుబ్బారెడ్డి బాబాయి మాట్లాడే వరకు చాలా బాధపడ్డా. కళ్లలో నీళ్లు తిరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కోసం నేను, అమ్మ.. ఎంతో కష్టపడ్డాం. ఐదేళ్లుగా ఎంవోయూ నా దగ్గర ఉన్నా ఒక్క మీడియా హౌస్‌కు వెళ్లలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎంవోయూ వాడుకోలేదు.. ఎక్కడా బయటపెట్టలేదు. వైఎస్ కుటుంబం గురించి చెడ్డగా చెప్పుకొంటారనే ఎంవోయూ గురించి ఎప్పుడూ చెప్పలేదు. జగన్ కోసం రెండు ఎన్నికల్లో పాదయాత్ర చేశా. చెల్లి కోసం ఇది చేశానని జగన్ జన్మలో ఒక్కటైనా చెప్పగలరా? జగన్ బెయిల్ రద్దవుతుంది కాబట్టి కోర్టులో కేసు వేశామని చెబుతున్నారు. తనకి లాభం జరుగుతుంది అంటే తల్లిని కోర్టుకు ఈడుస్తారా? సొంత కుమారుడే తల్లిని కోర్టుకు లాగడం దారుణం కాదా? రాజశేఖర్‌రెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో లేకపోతే.. కేసు నుంచి జగన్ బయటపడటం అసాధ్యమని భావించి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మూడు కోర్టుల చుట్టూ తిరిగి రాజశేఖర్‌రెడ్డి పేరును సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్పించారు. తనకు లాభం జరుగుతుందనుకుంటే ఎంతటివారినైనా జగన్ అణచివేస్తారు. విజయమ్మను కోర్టుకు లాగడానికి కారణం ఎవరు? మీ నాయకుడు ఎలాంటి వాడో వైకాపా శ్రేణులు ఆలోచించాలి. జగన్ లాంటి వ్యక్తి నాయకుడో.. శాడిస్టో వైకాపా నేతలు అర్థం చేసుకోవాలి. నేనేం తప్పు చేశానో చెప్పాలని వైకాపా నేతలు, కార్యకర్తల్ని అడుగుతున్నా అని షర్మిల అన్నారు.



## సిఎం సోదరులు దండుపాళ్యం బ్యాచ్: కెటిఆర్

హైదరాబాద్,అక్టోబర్26(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు తెలంగాణ పాలిట దండుపాళ్యం ముఠాలా మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. న్యాయవాది భూములకే సీఎం సోదరులు ఎసరు పెట్టినట్లు వార్తలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. బాధిత వ్యక్తి న్యాయం కోసం పోలీసుల వద్దకు వెళ్తే.. సీఎం సోదరులతో సెటిల్ చేసుకోమని చెబుతారా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్నది పోలీసులా రేవంత్ ప్రైవేట్ సైన్యమా న్యాయవాదికే న్యాయం దక్కకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. ఓ వైపు రాష్ట్రంలో ఉన్న సోదరులకు తెలంగాణ ఆస్తులను దోచి పెడుతూ.. మరోవైపు అమెరికాలో తమ్ముడి కంపెనీతో 1000 కోట్ల ఒప్పందంతో ఏం సందేశం ఇస్తున్నట్లు..అని నిలదీశారు. రాకేష్ రెడ్డి తండ్రి సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో పని చేసినందుకు మీరు ఆ కుటుంబానికి ఇచ్చిన బహుమానం ఇదేనా.. అని కేటీఆర్ అడిగారు.



# అవగాహన లేమితో క్యాన్సర్ మరణాలు

### మహిళల్లో బ్రెస్ట్యాన్సర్‌తో మహిళల మృత్యువాత
### ప్రాణనష్టాన్ని నివారించాల్సిన బాధ్య అందరిదీ
### తెలంగాణలో 50 నుంచి 60 వేల కేసులు నమోదు
### బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్నెస్ వాక్ లో మంత్రి దామోదర

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** క్యాన్సర్ గురించి అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి, ప్రాణ నష్టాన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇండియాలో ఏటా 14 నుంచి 15 లక్షల కేసులు నమోదవుతుంటే, తెలంగాణలో 50 నుంచి 60 వేల కేసులు నమోదవుతున్నాయన్నారు. ఎమ్ఎన్‌జీ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్నెస్ వాక్ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. నాన్ కమ్యునికేబుల్ డిసీజ్‌లు అన్నింటిలోకెల్లా క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమన్నారు. క్రమశిక్షణ లేని జీవన విధానం సహా అనేక కారణాలు ఈ వ్యాధి ప్రబలడానికి కారణమవుతున్నాయన్నారు. మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని.. మొత్తం ఉమెన్ క్యాన్సర్ బర్డ÷న్‌లో 14 శాతం బ్రెస్ట్ క్యాన్సర్ సంబంధిత కేసులే ఉంటున్నాయని డాక్టర్లు చెబుతున్నారని.. దీనిపై అవగాహన



కల్పించి, స్క్రీనింగ్ చేస్తే ఎర్లీ స్టేజ్‌లో రోగ నిర్ధారణ చేయొచ్చని చెప్పారు. తద్వారా క్యాన్సర్‌ను పూర్తిగా నయం అయ్యేలా ట్రీట్‌మెంట్ అందించవచ్చన్నారు. ప్రతి మహిళా స్క్రీనింగ్ చేయించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా స్క్రీనింగ్, ట్రీట్‌మెంట్ అందిస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో మొబైల్ ల్యాబ్స్ ద్వారా ఉచితంగా స్క్రీనింగ్ చేయిస్తామన్నారు. 6 క్యాన్సర్ రీజినల్ సెంటర్స్ ఏర్పాటు చేయబోతున్నా మని.. ఈ సెంటర్లలో డాక్టర్లు, పూర్తి స్థాయిలో ఎక్విప్‌మెంట్ తీసుకొస్తామన్నారు. ఈ సెంటర్లు అన్నింటికీ ఎంఎన్‌జే హాస్పిటల్ హబ్‌గా ఉంటుందని వెల్లడించారు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ ఒక్కరోజులోనో, ఒక్క వారంలోనో అయ్యేది కాదని.. నెలలు, సంవత్సరాల తరబడి సాగుతుందన్నారు. పేషెంట్లకు ఫిజికల్, మెంటల్, ÷నాన్షియల్ సపోర్ట్ చాలా అవసరమని.. దానికోసమే పాలియేటివ్ రిహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. డయాబెటీస్ క్లినిక్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. క్యాన్సర్ వాక్ అనంతరం క్యాన్సర్ హాస్పిటల్‌లో మంత్రి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏమ్ఎన్ జే క్యాన్సర్ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షేత్రస్థాయిలో స్వయంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో పాథలాజి ల్యాబ్స్, పెట్ స్కాన్, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, మెమ్మో గ్రామ్, పేషంట్ కేర్ పార్ట్స్, బోన్ స్కాన్, అల్ట్రా సౌండ్ విభాగాలతో పాటు పాలియేటివ్ కేర్ యూనిట్లను పరిశీలించారు. వాటి వినియోగంపై ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులును అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోజుకి ఎంత మంది క్యాన్సర్ రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు అనే విషయాన్ని డాక్టర్లు నర్సింగ్ సిబ్బందితో పాటు ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు వచ్చిన రోగుల బాగోగులను, సమస్యలను కూడా మంత్రి దామోదర రాజనర్సింహ అడిగి తెలుసుకున్నారు.

## విద్యార్థులకు షూస్ పంపిణీ

### కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అందచేత
### విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్న మంత్రిపొన్నం



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలోని మోడల్ పాఠశాలల్లో 11 ఏళ్ల తర్వాత 19 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 35 వేల మందికి బదిలీలు చేపట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో కలెక్టర్ పమేల సత్పతితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థుల రోల్ ప్లేను అధికారులతో కలిసి మంత్రి పొన్నం వీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో 23,000 మంది విద్యార్థులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద షూస్ పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 25వేల పాఠశాలల్లో రూ.11 వేల కోట్లతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. శానిటైజేషన్ సిబ్బంది కోసం నిధులు, ఉచిత విద్యుత్, తాగునీటితోపాటు అన్ని గురుకులాలకు అ÷-దదెలు చెల్లించామన్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 14 భాషల్లో మాట్లాడేవారని గుర్తు చేశారు. విద్యార్థులు కూడా ఇంగ్లీష్, హిందీ ఇతర భాషలు నేర్చుకొని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉన్నత శిఖరాలకు అదిరోహించాలంటే విద్యార్థులు కష్టపడాలని సూచించారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బంది ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు పొన్నం. కలెక్టర్ చొరవతో సీఎస్ ఆర్ ఫండ్‌తో షూస్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ మండలంలో ప్రభుత్వ పాఠశాలలో 1098 మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ జిల్లాలో 23 వేల మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తామన్నారు.

## చేయూత పెన్షన్ దారులను ఏకీకృతం చేస్తా

### మందకృష్ణ మాదిగ హెచ్చరిక



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** చేయూత పించన్‌దారులందరినీ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏకీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. చేయూత పింఛన్ తీసుకునే వారిని రేవంత్ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు. వీరితో కలిసి బలమైన ఉద్యమం చేపడతామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నమ్మిన పింఛన్‌దారులు కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. 10 నెలలు అయినా.. ఎందుకు పెంచి ఇవ్వడం లేదని ప్రశ్నించారు.'ఏపీలో ఏప్రిల్ నెలలో మేం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చాం. దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని కోరాం. ఆయన జూన్‌లో అధికారంలోకి రాగానే ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలవి ఇచ్చారు. ఏపీలో కండరాల క్షీణత ఉన్నవాళ్లకు రూ.15 వేల పింఛన్లు ఇస్తున్నారు. రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం. తెలంగాణలో వచ్చే నెల మొదటి వారంలో గడిచిన 10 నెలల బకాయిలతో పాటు నవంబర్ పింఛన్ ఇవ్వాలి. లేదంటే ఉద్యమం తప్పదు. నవంబర్ 1 నుంచి 16 వరకు ప్రతిరోజు రెండు జిల్లాల్లో చేయూత పింఛన్ లబ్దిదారులకు చైతన్య సభలు నిర్వహిస్తాం. అప్పటికీ ఇవ్వకుంటే నవంబర్ 26న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తాం 26న వికలాంగుల మహా గర్జన పేరిట వేలాది మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడతాం. కాంగ్రెసేతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తాం. రేవంత్ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటాం' అని మందకృష్ణ అన్నారు.

# దండుపాళ్యం బ్యాచ్‌లా బిఆర్ఎస్ సోషల్ మీడియా

### కేటీఆర్, హరీష్ రావులకు మతి భ్రమించింది
### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బిఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం బ్యాచ్‌లా మారిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టనని హెచ్చరించారు. తాను కలెక్టర్‌ను తిట్టినట్టు వీడియో క్రియేట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై ట్రోల్ చేసేవాళ్లు దొరికితే బట్టలూడదీసి కొడతాననని జగ్గారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులపై జగ్గారెడ్డి విరుచుకు పడ్డారు. వారిద్దరికీ మతిభ్రమించిందని దుయ్యబట్టారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికారం లేక కెటిఆర్, హరీశ్ రావు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. ఇక, మహిళా కలెక్టర్‌పై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ కలెక్టర్‌కు తాను ఫోన్ చేస్తే ఎత్తలేదని, దీంతో తనకు కోపం వచ్చి తిట్టానంటూ బహిరంగంగానే చెప్పారు. కలెక్టర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీనిపై జగ్గారెడ్డి మరోసారి స్పందించారు. తాను చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత కలెక్టర్‌ను ఉద్దేశించి కాదని.. గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్లపై వ్యాఖ్యలు చేసినట్లు ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో ఇద్దరు కలెక్టర్‌లకు పది సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు.. వాళ్ళని తిట్టాను.. తప్పేంటి. నేను తిట్టింది గత ప్రభుత్వంలో... ఇప్పుడు కాదు' అంటూ వివరణ ఇచ్చారు.అలాగే.. బీఆర్ఎస్ సోషల్ మీడియాపైనా జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం ముఠాలాగా తయారైందంటూ విరుచుకుపడ్డారు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్, హరీష్ రావుకు పిచ్చిపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని



మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా చర్యలతో కేటీఆర్, హరీష్ రావులు తిట్లు తింటున్నారన్నారు. అమెరికా, సింగపూర్‌ల నుంచి సోషల్ మీడియా నడపడం కాదని... దమ్ముంటే ధైర్యంగా ముందుకు రావాలన్నారు. సోషల్ మీడియా నడిపేది ఎవడో తెలిస్తే ఖైరతాబాద్ సెంటర్లో బట్టిలిప్పి కొడతా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై పోరాడితే తప్పులేదని.. కానీ వ్యక్తిగత అంశాలపై బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోల్ చేస్తోందన్నారు. సీఎం వ్యాఖ్యలు అననివి అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈరోజు వార్నింగ్ ఇస్తున్నా తేడా వస్తే తాట తీస్తా. రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డి ఫైటర్స్.. బీఆర్ఎస్ నేతలు ఇలానే వ్యవహరిస్తే మా సోషల్ మీడియాను రంగంలోకి దింపుతాం. కేటీఆర్ డబుల్ లచ్చా. చిట్టి నాయుడు కాదు... రేవంత్ రెడ్డి గట్టి రెడ్డి. రేవంత్ రెడ్డి తన ఛాంబర్లో తొడగొడితే కేటీఆర్‌కు కాళ్ళు వణుకుతాయి. జగ్గారెడ్డి మాటే శాసనం అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తనకు కోపం వస్తే ఇలాగే ఉంటుందని అన్నారు.

## పోలీసుల ఆందోళనల వెనక కుట్రలు

### పోలీస్ ఉన్నతాధికారుల అనుమానం
### ఆందోళనలుచేస్తేకఠినచర్యలు తప్పవు
### రాష్ట్ర డిజిపి జితేందర్ ప్రకటన విడుదల



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ పోలీస్ బెటాలియన్లలో పనిచేసే కానిస్టేబుల్స్ చేస్తున్న ఆందోళనల పైన పోలీస్ శాఖ గుర్రుగా ఉంది. విధులను బహిష్కరించటం, రోడ్ల పైకి వచ్చి ఖాకీలే ఆందోళన చేయడం తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనగా పోలీస్ శాఖ భావిస్తోంది. ఈ పరిణామాన్ని ఏమాత్రం లైట్ తీసుకోకూడదని పోలీసు శాఖ నిర్ణయించింది. పోలీసు శాఖలో పనిచేస్తూ జన జీవనానికి ఇబ్బంది కలిగేలా రోడ్లపై వచ్చి ఆందోళన చేస్తున్న పోలీసులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమైనట్లు సమాచారం. పోలీస్ బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు సెలవుల విషయంలో పాత పద్ధతిని అనుసరిస్తామని ఇప్పటికే చెప్పినప్పటికీ ఉద్దేశపూర్వకంగా ఆందోళన చేస్తున్నారని పోలీస్ శాఖ ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో బాధ్యులపై తీవ్రమైన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా నిరసనలకు దిగిన కొంతమందిని పోలీస్ శాఖ ఇప్పటికే గుర్తించింది. కానిస్టేబుళ్ల ఆందోళన వెనుక ప్రభుత్వం అంటే గిట్టని కొన్ని రాజకీయ శక్తుల హస్తముందని పోలీస్ శాఖ అనుమానిస్తోంది. ఈ క్రమంలో బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనపై తెలంగాణ డీజీపీ జితేందర్ తీవ్రంగా స్పందించారు. క్రమక్షశిణతో కూడిన ఫోర్స్‌లో ఉంటూ ఆందోళనలు చేయడం సరికాదన్నారు. ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ జితేందర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెలవులపై పాత పద్ధతే అమలు చేస్తామని చెప్పినప్పటికీ మళ్లీ ఆందోళనలకు దిగడం సరికాదన్నారు.

## ఒకే పోలీస్ విధానం కోసం


### తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరులో 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళన చేపట్టారు. మామునూరు బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. ఆందోళనల నేపథ్యంలో నల్గొండ గ్రామీణ ఎస్ఐ సైదాబాబుకు నిరసన సెగ తగిలింది. ఎస్ఐ గోబ్యాక్ అంటూ 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు.

## ఊరికెళ్లి వచ్చేలోపు ఇల్లు గుల్ల

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పుట్టినరోజు వేడుకలకు రాజమండ్రికి వెళ్లి వచ్చేలోపు ఇంట్లో చోరీ జరిగింది. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రేమ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న శివరాం ప్రసాద్ ఇంట్లో చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి సుమారు రూ.15 లక్షలు విలువ చేసే నగలను దొంగలించారు. ఇంట్లో వస్తువులు అన్నీ చిందరవందరగా పడేసి.. ఇల్లు గుల్ల గుల్ల చేశారు.

ఎడిటోరియల్



# పర్యావరణ హితం పట్టని పాలకులు

## పెరుగుతున్న పట్టణీకరణతో కాలుష్యం

## నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలం

పర్యావరణ పరిరక్షణ అన్నది కేవలం నినాదంగా మారింది. ఢిల్లీ విషయమే తీసుకుంటే వాతావరణ కాలుష్యం అరికట్టే చర్యలు కానరావడం లేదు. కోర్టులు మొత్తుకుంటున్నా పట్టింపు లేదు. కాలుష్యం కారణంగా తాను వాకింగ్‌కు కూడా వెళ్లలేక పోతున్నానని సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ఎంతగాపరిస్థితి దిగజారిందో గుర్తించాలి.ఢిల్లీ కాలుష్యపరిస్థితిలో మార్పు కానరావడం లేదు. గాలి నాణ్యత పడిపోతున్నా పట్టించుకోవడం లేదు. పంట వ్యర్థాలను కాల్చకుండా కూడా అరికట్టడం లేదు. మానవాళికి చెట్లు చేసే మేలేమిటో తెలుసుకోవడానికి ఎవరూ గూగుల్‌ను ఆశ్రయించనవసరం లేదు. పర్యావరణవేత్తలు చెబితే తప్ప తెలియని వారెవరూ లేరు. చెట్ల ఉపయోగాల గురించి బడి చదువుల దగ్గరనుంచి గురువులు నూరిపోయడమే ఇందుకు కారణం. దురదృష్టమేమంటే అధికార పీఠాలపై ఉన్న నేతలు, ఉన్నతాధికార వర్గంలో పనిచేస్తున్నవారు ఏ బళ్లో చదువుకుని ఆ స్థాయికి ఎదిగారోగానీ... దేశంలో 'అభివృద్ధి' పేరు చెప్పి వృక్ష సంహారం జరగని రోజంటూ దేశంలో ఉండటం లేదు. చెట్లను కాపాడటానికి పర్యావరణ ఉద్యమకారులు చేయని పోరాటమంటూ లేదు. ప్రాణవాయువును అందిస్తున్న వృక్షజాలాన్ని ధ్వంసం చేయాలా అని ప్రశ్నిస్తున్నారు. విభిన్న జాతుల పక్షుల్ని వీక్షించడానికి, తమ కెమెరాల్లో బంధించడానికి విహంగ ప్రేమికులు నిత్యం ప్రకృతి ఒడిలోకి వస్తారు. ప్రశాంతంగా స్వచ్ఛమైన వాయువు పీల్చి పునీతులు కావడానికి నగర వాసుల్లో అత్యధికులు ఎన్నుకునే పార్కులు, చెట్టు ఉన్నచోటే. ఇది లోపించడం వల్ల ఇటీవల ఢిల్లీ కాలుష్యం పీల్చలేనంతగా తయారయ్యింది. చెట్లనుంచి వీచే గాలిని ఆస్వాదిస్తూ వందలమంది సైక్లింగ్, జాగింగ్ చేస్తుంటారు. పాలకుల తీరు కారణంగా, నగాల వ్యాప్తి కారణంగా ముంబైతో సహా మన మహానగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. ఉపాధి దొరుకు తుందని పల్లెలు వీడి వస్తున్న వారితో పట్టణీకరణ పెరుగుతోంది. ప్లాస్టిక్ విపరీతంగగా వాడకం పెరరిగి అనేకం కాలుష్య కారకాలుగా తయారయ్యాయి. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత నగరాలు 20 ఉంటే అందులో 15 మన నగరాలే. తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రపంచంలోని 15 నగరాల్లో మన వాటా 11. ఈ నగరాల వాతావరణంలో, ఇక్కడి తాగునీటిలో మృత్యువు దాగుందని నిపుణులు చాన్నాళ్లుగా చెబుతున్నారు. నగర పౌరుల ఊపిరితిత్తుల్లోకి కొంచెం కొంచెంగా చొరబడుతున్న కాలుష్యం వారిని రోగగ్రస్తులుగా మారుస్తోంది. కేన్సర్, గుండె జబ్బులు వగైరాలకు కారణమవుతోంది. అనేకుల్లో అకాల వృద్ధాప్యాన్ని కలిగిస్తోంది. వారిని పనిపాటలకు దూరం చేస్తోంది. ఇదంతా మన పాలకులకు ఆందోళన కలిగించాలి. దీన్ని సరిచేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి పురిగొల్పాలి. కాలనీలో చెట్లు పెంచాలి. ఉన్న చెట్లను తొలగించకతప్పదను కుంటే ఆ చెట్లను మరొకచోట పాతడానికి ప్రయత్నించాలి. ప్రపంచ అధ్యయన సంస్థలు చెబుతున్న వాస్తవాలను అమలు చేయాలి. ఇల్లు కట్టుకుందా మనో, ఉన్న ఇంటిని విస్తరించుకుందామనో ఎవరైనా తమ ఆవరణలో చెట్లు కొట్టాలంటే అందుకు అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమకు అలాంటి నిబంధనలు వర్తించవన్నట్టు అధికార యంత్రాంగాలు ప్రవర్తిస్తున్నాయి. పాలకులే ఇలా చట్టాల్ని ధిక్కరించే స్థితికి దిగజారడం కారణంగా దేశంలో పర్యావరణం దెబ్బతింటోంది. ఇప్పటికైనా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

# ట్రాన్స్‌కోకు గుదిబండగా విద్యుత్ బకాయిలు

## బిల్లులు చెల్లించడంలో స్థానిక సంస్థల నిర్లక్ష్యం

మున్సిపల్ పరిధిలో విద్యుత్ బకాయలు చెల్లింపు జరక్క అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో డిస్కంలకు రుణభారం పెరుగుతోంది. కొన్ని మునిసిపాలిటీలుగా మారాక కరెంట్ బిల్లు బకాయిపడితే మరికొన్ని గ్రామపంచాయతీల ఆదాయం లేక బకాయిలను మూటగట్టు కున్నాయి. వీధి దీపాలు, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్‌ను వాడుకుంటున్నా బిల్లులు చెల్లించడం లేదు. బిల్లుల చెల్లింపు విషయంలో మునిసిపాలిటీలు వ్యవహరిస్తున్న తీరు విద్యుత్ శాఖకు ఇబ్బందికరంగా మారిందని అధికారులు వాపోతున్నారు. దీంతోవిద్యుత్ బకాయిల చెల్లింపులో మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. మున్సిపాలిటీలు ట్రాన్స్‌కోకు చెల్లించాల్సిన బకాయిలు కోట్లలోపేరుకుపోయాయని సమాచారం. కొన్ని మునిసిపాలిటీలు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడం విద్యుత్ శాఖకు భారంగా మారింది. వాటికి ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు రావడం లేదు. దాంతో కార్యాలయాలకు కరెంట్ కట్ కాకుండా చూసుకుంటున్నారు. మిగిలిన వాటికి విద్యుత్ సరఫరా నిలిపి వేసే అవకాశంలేనందున పట్టించుకోవడం లేదు. దీంతో అనేక మునిసిపాలిటీల బకాయిలు కొన్నేళ్ల నుంచి పేరుకుపోయినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.



# ఆర్థిక విధానాలను ఎన్‌డి పక్షాలు చర్చించాలి!

గత దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. ధరలు పెరగడం, పేదలు చితికి పోవడం అన్నది సమాంతరంగా సాగుతోంది. అయినా కిందిస్థాయిలో ఏం జరుగు తున్నదో తెలుసుకోలేక పోతున్నారు. కనీసం ఇప్పటికైనా ఎన్‌డిఎ పక్షాలు ఆలోచనచేయాలి. ప్రజలపై మోపుతున్నా భారాలను తగ్గించాలి. ధరల పెరుగుదలపై చర్చించాలి. మోడీ ఆర్థిక విధానాలను చర్చించాలి. లేకుంటే ఎన్‌డిఎ పక్షాలు కూడా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. కేవలం కార్పోరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితికి పోతున్నారో గమనించడం లేదు. జిఎస్టీ కారణంగా వస్తువుల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది బిజెపి పాలకులు ఆలోచన చేయాలి. ఎన్‌డిఎ భాసగ్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, ఇతర పార్టీలు కడా దీనిని విశ్లేషించాలి. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ ఉన్నారే తప్ప ఫలితాలను విశ్లేషించుకుని తప్పులను సరిదిద్దుకుందామన్న లక్ష్యాన్ని ప్రకటించడం లేదు. ప్రజల జీవన స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారంటూ, చెప్పు కోవడం ఆత్మవంచన తప్ప మరోటి కాదు. కేవలం కాంగ్రెస్ ను, విపక్షాలను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి. ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహరధాన్యాల ధరలు తగ్గాలి. ఎక్కడ తప్పిదం జరిగిందో పరిశీలన చేయాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీపై ప్రజలకు విశ్వాసం ఉంటే పరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉంటాయి. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే వాత తప్పదని మొన్నటి ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు కొద్దిగా రుచి చూపారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రధాని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టి ప్రచారం చేశారు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేకపోతున్నామని గమనించాలి. సంస్కరణలంటే ప్రజల జీవన ప్రమాణాలు మారాలని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నా, గట్టిగా పోటీ పడలేకపోయినా ప్రజల ఆలోచనలు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేసింది ప్రధాని మోడీ అని గుర్తించాలి. ఇకముందు కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి సవాలు ఎదురవుతుందని భావించాలి. దానికి కాంగ్రెస్ గొప్పతనం కాకుండా మోడీ అనుసరిస్తున్న పిడివాద సంస్కరణల ఫలితమని గుర్తించాలి. హర్యానాలో మళ్లీ అధికారం నిలబెట్టు కోవడం..బిజెపికి ప్రజలు వత్తాసు పలుకుతున్నారని అనుకోరాదు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తుందనడానికి కాశ్మీర్, హర్యానా ఫలితాలే ప్రత్యక్ష నిదర్శనం. తాము ప్రవచిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు ఎందుకు మేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ విపరిణామాలను విశ్లేషించుకోవాలి. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని మిత్రద్వయం గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు. ఇకపోతే అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్య పెట్టిన మోడీ ఆ ఊసే ఎత్తడం లేదు. పదేళ్లు

కావస్తోంది. స్వయం ఉపాధి పేరుతో నిరుద్యోగులను మభ్యపెడు తున్నారు. గత పదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కార్మిక వ్యతిరేక విధానాలతో వేలాది పరిశ్రమలు మూతపడడానికి కారణం అయ్యారు.బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు, నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కారణంగా కనీసం 6 కోట్ల మందికి ఉపాధి పోయిందని అంచనా. అన్ని సంస్థలను ప్రైవేటుకు అప్పగించే పనిలో మాత్రం వేగం పెంచారు. రైల్వేరంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, దిగుబడిలేక ఎంతో మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరోనా వైరస్ కష్టకాలంలో ఉపాధి లేక వేలాదిమంది ఆకలితో అలమటించారు. ఆసుపత్రులకు డబ్బులు కట్టలేక ఆస్తులు అమ్ముకున్నారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆనాటి పరిస్థితులను చూసి చలించిన ఎందరో వారిని దగ్గరికి తీసి, వారి ఆకలిని తీర్చి వారిని వారి గమ్యస్థలాలకు చేర్చే ప్రయత్నం చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం వారిని గాలికొదిలేసింది. మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అనుకూల రాజకీయాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్లకు వివిధ రకాల రాయితీలు, కానుకలు సమర్పిస్తూ వారిని మరింత సంపన్నవంతం చేయడం దారుణం. భారత రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం సగటున ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలు సంపన్నులకు రద్దయ్యా యన్నది గుర్తించాలి. కార్పొరేట్లు తీసుకున్న రూ.4.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాల్లో కేవలం రూ. 1.61 లక్షల కోట్లు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వసూలు చేశారు. అంటే బ్యాంకులు రూ.2.85 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇలా బ్యాంకుల సొమ్ము కార్పొరేట్ల పాలు అవుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక పరోక్ష పన్నులను, సెస్సులను పెంచి జనంపై భారాలు పెంచి, ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్లకు వివిధ రూపాల్లో రాయితీలు కల్పిస్తోంది. బడ్జెట్లో దాదాపు 8శాతం కార్పొరేట్ పన్ను రాయితీల ద్వారా వారికి లక్షల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చింది. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా సంపన్నులకు ప్రజల సంపదను దోచిపెడుతున్న సర్కారు సామాన్య రైతులు, సాధారణ ప్రజలపట్ల మాత్రం కర్కశంగా వ్యవహరిస్తోంది. కరువు కాటకాల వలన, వరదలు, తుపాను వలన నష్టపోయి లేదా పంటకు న్యాయమైన ధర దక్కక తీవ్రంగా నష్టపోయిన కారణంగా బ్యాంకులో తీసుకున్న రుణం తిరిగి తీర్చలేని రైతుల నుండి మాత్రం ఎటువంటి మినహాయింపు లేకుండా వసూలు చేయాలని బ్యాంకులను సర్కారు ఆదేశిస్తుంది. ఈ పదేళ్లలోనే పది లక్షల కోట్ల రూపాయలకు పైగా కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఆర్థిక క్రమశిక్షణ ఏమయినట్లో మోడీ సర్కారే చెప్పాలి.

(ఆధ్యాత్మిక చింతన)

# మన పూజలో ఆరోగ్యసూత్రం

పూజ అనేది కూడా ఒక యోగ పక్రియ. మనసుతో చేసే వ్యాయామం. పూజ అంటే చాదస్తం కాదు .మన ఆరోగ్యం, మన జ్ఞానానికి సంబంధించిన విషయమని చెప్పాలి. యోగ ద్వారా మన ఆరోగ్యాన్ని మన కంట్రోల్‌లో ఉంచుకోవడం సాధ్యమని తేలింది. దానికి మరో రూపమే పూజా,ధ్యానంగా గర్తించాలి. గుడి అంటే మన స్వచ్ఛతకు చక్కటి ప్రదేశం. ధ్యానం అనేది మన మెదడుని మనమే ట్యూన్ చేసుకునే పక్రియ. దీప ప్రజ్వలనం అనేది..... త్రాటకం అనే యోగ పక్రియ. రోజూ ఓ మూడు నిమిషాలు నూనె దీపాన్ని తదేకంగా చూస్తే.... కంటి జబ్బులను అరికట్టవచ్చు అని పెద్దలు చెప్పిన మాట. ఏదైనా కష్టమైన మంత్రాన్ని ఓ 11 సార్లు జపిస్తే.. నాలిక మొద్దుబారదు. అది నాలికకు ఎక్సర్‌సైజ్. అందువల్ల ఎటువంటి కష్టమైన పదాలనైనా పలకగలిగే శక్తి వస్తుంది ..ధారణ శక్తి పెరుగుతుంది. భాష మీద పట్టు పెరిగితే...స్టేజ్ ఫియర్ కూడా పోతుంది. భూమిలో ఎక్కడయితే తరంగాలు కలుస్తాయో అక్కడ మూల విరాట్ ఉంటుంది. ప్రతిష్ఠించే ముందు రాగి రేకులను కాల్చి ఉంచుతారు. అవి ఈ తరంగాలకు ప్రేణగా పని చేస్తాయి. మనం గుడి చుట్టు ప్రదక్షిణలో తిరిగినపుడు ఆ తరంగాల శక్తి మన దేహానికి వస్తుంది. గుడిలోనే దేవుడు వుంటాడా అనేది ఒక వాదన.. ఎక్కడైన వుంటాడు కాని ఈ దేవాలయ దర్శనం అందుకు పెట్టారు. పుణ్యక్షేత్రాలు ఈ సూత్రంపైనే మీద ఆధారపడి వుంటాయి. ఇవి మన శరీరం లోని షట్ చక్రాలను ప్రభావితం చేస్తాయి. ఆడవారిని మగవారిని నగలు వేసుకుని గుడికి వెళ్ళమనేది మన సంపదను చూపించడానికి కాదు.. బంగారం వంటివి ఈ తరంగాలను బాగా గ్రహిస్తాయని. అదే విధంగా మంత్రోచ్ఛా రణలు అక్షర నియమంతో ఒక లయను కల్గి ఉత్తేజపరువస్తాయి. గర్భగుడి ద్వారం ఒక వైపుకు ఉండటం వల్ల ఆ శక్తిని మన శరీరం గ్రహిస్తుంది. అందుకే మరీ ఎదురుగా కాక ఒక వైపుకు ఉండమంటారు. విగ్రహాలు పంచ లోహాలతో ఉంటాయి.. వాటికి పాలు తేనె వంటి వాటితో అభిషేకించినపుడు కింద ఉన్న తరంగాల శక్తితో ఔషధ గుణాన్ని సంతరించుకుంటాయి. హారతి తీసుకునేటపుడు ఆ వెచ్చదనాన్ని మన కంటికి తగిలేలా చేయాలి.. దీనికి ఆయుర్వేద పరిభాషలో స్వేదకర్మ అని పేరు. ఊరికే గాల్లో హారతి తీసుకుంటే చాలదు. తీర్థంలో పచ్చ కర్పూరం.. తులసి.. లవంగాలు ఇలా ఎన్నో.. పంచామృతంతో అభిషేకం చేసినవి తీర్థంగా ఇస్తారు. తడిబట్టలకి ఆక్సిజన్ ని ఎక్కువగా తీసుకునే గుణం ఉంటుంది.. అందుకే మడిని పాటిస్తారు. ఇవన్నీ కూడా మన సైన్సును ఆధారం చేసుకుని ఆచరించేలా చేసినవని గుర్తించాలి. వీటిని ఆచరిస్తే ఆరోగ్యం మనలను వెన్నంటి ఉంటుంది.

# బియ్యం పథకంపై కొరవడిన ఆజమాయిషీ

## చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్న దళారులు

చౌక బియ్యాన్ని తినడానికన్నా అమ్ముకోవడానకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవుతున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. ఈ విషయాలన్నీ ప్రజందరికీ తెలుసు. రాజకీయ నాయకులు కూడా తెలుసు. కానీ ఎవరు కూడా దీనిపై చర్చించడం లేదు. ఎక్కడా ప్రస్తావించడం లేదు. తమకెందుకులే అన్న నిర్లిప్తతతే ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారింది. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల రాయితీ బియ్యం అక్రమ రవాణాను కొందరు వృత్తిగా మార్చుకున్నారు. తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. దీనిని కూడా గుర్తించడం లేదు. ధరలు పెంచితే ఎక్కడ ఓట్లు గల్లంతవుతాయో అన్న



భయం పాలకులను వెన్నాడుతున్నట్లుగా ఉంది. ఈ మొత్తాన్ని రైతులకు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. ధాన్యం కొనండని రైతులు చేస్తున్న ఆందోళనలను గుర్తించి వారికి అండగా నిలవాలి. కిలోబియ్యం పథకం దుబారాను తగ్గించి వాటిని ధాన్యం కొనుగోళ్లకు వెచ్చించాలి. కార్డులు తగ్గించడం కన్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం. ఇప్పటికైనా ఈ అక్రమాలను గుర్తిస్తే ఖజానాపై భారం తప్పుతుంది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 27-10-2024


# ఉపాధ్యాయులు సమాజం పట్ల బాధ్యతగా విధులు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 26 (క్రైమ్ మిర్రర్):** డీఎస్సీ ద్వారా నూతనంగా ఉద్యోగంలోకి ప్రవేశించిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు నిబద్ధతతో సమాజం పట్ల బాధ్యతతో తమ విధులు నిర్వర్తించి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో నమోదు నిలకడలను పెంచడానికి కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో నూతనంగా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో జిల్లా విద్యా శిక్షణా కేంద్రం కొత్తగూడెం నందు ముఖాముఖి చర్చలో పాల్గొన్న కలెక్టర్ ఉపాధ్యాయులకు అనేక అంశాలపై దిశా నిర్దేశం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పిల్లలకు కావలసిన సదుపాయాల అందించడంలో జిల్లా యంత్రాంగం బాధ్యత తీసుకుంటుందని, పిల్లల నమోదు పెంచటం నిలకడను సాధించడం పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం, పిల్లలను సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం వంటి బాధ్యతలను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. నూతనంగా ఉద్యోగం సాధించిన స్ఫూర్తితో మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు అవ్వాలని విద్యార్థిని విద్యార్థులను తమ సొంత పిల్లగా భావించి వారికి సదా అండగా నిలబడి విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ, యుడైస్ పోర్టల్, సమగ్ర శిక్ష అంశాలు, దివ్యాంగ పిల్లలకు సంబంధించిన అంశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్ కి సంబంధించిన అంశాలు మొదలైనవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు డాక్టర్ ప్రభు దయాళ్, ఎన్. సతీష్ కుమార్, ఎస్.కె సైదులు, ఏ, నాగరాజశేఖర్, ఎస్ శ్రీనివాస్ వివరించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర చారి మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులందరూ పిల్లల అభివృద్ధికి పాటుపడుతూ, భద్రాద్రి జిల్లాను విద్యారంగంలో ముందు వరుసలో నిలబెట్టాలని సూచించారు.

# మిర్యాలగూడలో పశుగణన ప్రారంభం




**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ డివిజన్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణనను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 25, 2024 నుండి ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుంది. ఈ కాలంలో గ్రామాల్లో ప్రతి ఇంటిలోని పశువులు మరియు జీవజాలం గురించి డేటాను సేకరించి, లైవ్ స్టాక్ సెన్సెస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.రైతులు తమ పశువుల సమగ్ర సమాచారాన్ని అందించి, ఈ గణనలో సహకరించాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శంకర్ రావు, తుంగపాడు డాక్టర్ జ్ఞానేశ్వర్ ప్రసాద్, ఆలగడప డాక్టర్ నాయిని దుర్గారమాదేవి, దామరచర్ల డాక్టర్ సందీప్, కొండ్రపోలు డాక్టర్ స్వప్న, అడవిదేవులపల్లి డాక్టర్ మేఘ్యనాయక్, పశు వైద్య జెవిఓ జానీ పాషా, వీఏలు అసిము, శ్రీకాంత్, గోపాలమిత్ర సూపర్వైజర్ శివారెడ్డి పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి.. మరొకరికి గాయాలు





**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ట్యూషన్ అయిపోగానే తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలం గుబ్బడిఫతేపూర్ గ్రామానికి చెందిన భరత్ (15), శ్రీచరణ్ గౌడ్ (15) శంకర్‌పల్లిలోని వివేకానంద పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. శనివారం స్కూల్‌లో ట్యూషన్ అయిపోగానే రాత్రి 7:30 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు ఇంటి వెళ్తున్న క్రమంలో మార్గం మధ్యలో శంకర్‌పల్లి పరిధి రామంతాపూర్, ఎర్వగూడ క్రాస్ రోడ్డులో ముందుగా వెళ్తున్న ఫార్చునర్ వాహనం నడుపుతున్న డైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకనుంచి వస్తున్న దివచక్రవాహనం ఢీ కొని భరత్ అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, చరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఫార్చునర్ వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ వాహనమని, ప్రమాద సమయంలో డైవర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ వాహనంలోనే ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# రావిర్యాలలో పచ్చని పంట పోలాల్లో చిచ్చుపెట్టిన పరిశ్రమలు

- కులసంఘాలకు ఇచ్చిన స్థలాన్ని పరిశ్రమల కోసం అధికారుల సర్వే
- రావిర్యాల, జన్నాయిగూడ, భునిర్వాసితులకు న్యాయం జరిగేనా....?
- పరిశ్రమ ఏర్పాటుకై భు సర్వేని అడ్డుకున్న రైతులు న్యాయం జరిగేవరకు పోరాటం ఆగదురైతులు
- ఫ్యాబ్సిటిలో వందల ఎకరాలను కోల్పోయిన రైతులు
- ఉపాదిలేక, ఉద్యోగాలురాక...ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- ప్రభుత్వాలు మారిన రైతులకు న్యాయం చేయని నేతలు








**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో ఉన్న ఫ్యాబ్ సిటీకి టి జి ఐ ఐ సి అధికారులు వచ్చి శనివారం గతంలో రావిర్యాల గ్రామంలోని కులసంఘాలకు ఇచ్చిన స్థలం నుండి సర్వే చేయడానికి వచ్చిన అధికారులు 52 ఎకరాల భూమిని ఒక ప్రైవేట్ పరిశ్రమకు ఇవ్వడంతో రైతులు అగ్రహానికి లోనయ్యారు,గతంలో 150 కుటుంబాల రైతులు దాదాపుగా గత 100 సంవత్సరాల నుండి వ్యవసాయం చేస్తుండగా 620 ఎకరాల పచ్చటి పంటలు పండే భూమిని 2004 సంవత్సరాలనుండి గతంలో ఎ పి ఐ ఐ సి అధికారులు రైతుల భూమిని స్వాధీనం చేసుకున్నారు, దాదాపుగా 20 సంవత్సరాలనుండి రాజకీయ నాయకుల చుట్టూ మరియు ఎ పి ఐ ఐ సి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగితే గతబి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు న్యయం చేయాలి అని నిర్ణయం తీసుకొని గతంలో వ్యవసాయం చేసుకున్న కస్తూరైతులకు 150 గజముల ప్లాట్లు,సీలింగ్ పట్టా రైతులకు 250 గజముల ప్లాట్స్ ఇస్తాము అని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తుసుకొని టి ఎస్ ఐ ఐ సి, ఎం ఆర్ ఓ, ఆర్ డి ఓ అధికారులు ఎచ్ ఎం డి ఎ లేఔట్ మ్యాప్ గీసి సుమారు 461 ప్లాట్స్ తయారు చేసి టోకెన్స్ నంబర్స్ మరియు రైతులకు ఇన్ని ప్లాట్స్ ఇంత స్థలం అని నిర్ణయం తీసుకోని గత 3,4 సంవత్సరాల క్రితం మహేశ్వరం మండలంలో స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎం ఆర్ ఓ ఆర్ డి ఓ,టి ఎస్ ఐ ఐ సి అధికారుల ఆధ్వర్యంలో రైతులకు టోకెన్స్ ఇచ్చారు కానీ ఇప్పటి వరకు ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు,ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు కేటాయించిన స్థలము చూపించి సర్టిఫికెట్ ఇచ్చి మీరు సర్వే చేసుకొవాలని సర్వేయర్లను కోరారు. మాకు ఇచ్చిన ప్లాట్స్ ఇవ్వకపోతే మాత్రం ఫ్యాబ్ సిటీలో ఎలాంటి నూతన పరిశ్రమలను పెట్టనివ్వమని డిమాండ్ చేసారు మా ప్రాణాలు తీసిన సరే నష్టపరిహారం ఇచ్చే వరకు రైతులము అందరం కలిసి ఐక్యమంత్యంతో ఉండి నూతన పరిశ్రమలను అడ్డుకుంటామని హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో జల్లాల లక్ష్మయ్య,గోదాసు నర్సింహా,నక్క శ్రీశైలం, కుమ్మరి యాదయ్య, పిట్టల రవి,పిట్టల యాదయ్య,శేఖర్, శ్రీశైలం,గిరి,మంగలి యాదయ్య,మహేష్, మరియు రావిర్యాల జన్నాయిగూడ రైతులుపాల్గొన్నారు.



# ప్రాణహితలో ముగ్గురు యువకుల గల్లంతు

**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం సోమిని గ్రామం సమీపంలోని ప్రాణహిత నదిలో ముగ్గురు ఇంటర్ చదువుతున్న యువకులు ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్ళి గల్లంతు అయ్యారు. శనివారం బెజ్జు ర్ మండలం గో ల్ కొండ గ్రామానికి చెందిన ఐదుగురు ప్రాణహిత నదిలో స్నానానికి దిగగా ఇద్దరు ఒడ్డుకు చేరారు. మరో ముగ్గురు గల్లంతు అయినట్టు సమాచారం. గల్లంతు అయిన యువకుల కోసం గ్రామస్తులు గాలిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది పరిసర ప్రాంతాల్లో ఉ న్న ఓ. వ్యక్తి కుటుంబీకులకు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు, గల్లంతైన ముగ్గురు యువకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# యువత రక్తదానం అభినందనీయం

## సబ్ కలెక్టర్ నారాయణ అమిత్




**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** ప్రాణాపాయ పరిస్థితులు లేదా అత్యవసర సందర్భాల్లో రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పోలీస్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో పోలీస్ అమరుల వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన స్థానిక ఎంవిఆర్ ఫంక్షన్ హాలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ..రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడిన వారవుతారని, ఈ సేవకు యువత ముందుకు రావడం శు భపరిణామమని అన్నారు. కార్యక్రమంలో డిఎస్పి కె.రాజశేఖర్ రాజు పాల్గొని, డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది మరియు పట్టణ పరిధిలోని యువత రక్తదానం చేసినట్లు తెలిపారు.నల్లగొండ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మొత్తం 106 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) రక్తదానం చేసి, అమరులకు నిజమైన నివాళి అర్పించారు.కార్యక్రమంలో మిర్యాలగూడ వన్, టూ టౌన్ సీఐలు కోట కరుణాకర్, పి.నాగార్జున, మిర్యాలగూడ రూరల్, హాలియా, నాగార్జునసాగర్ సీఐలు కె.వీరబాబు, సీఐ జనార్ధన్, బీసన్న,ఎస్ఐలు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్బంగా విద్యార్థులకు ఆట వస్తువులు పంపినీ చేసిన

## బొల్లమోని శ్రీకాంత్ ముదిరాజ్



**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి చౌటుప్పల్:** చౌటుప్పల్ యువజన కాంగ్రెస్ నాయకులు బొల్లమోని శ్రీకాంత్ ముదిరాజ్ జన్మదిన సందర్భంగా తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. వాలీబాల్స్ , రింగ్ బాల్స్, చెస్, క్యారం బోర్డ్స్ మరియు వాలీబాల్ నెట్స్ అందజేయడం జరిగింది. విద్యార్థులందరూ అతనికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమం చేసినటువంటి బొల్లమోని శ్రీకాంత్ కు ప్రధానోపాధ్యాయురాలు మరియు స్కూల్ స్టాఫ్ కృతజ్ఞతలు తెలిపారు.



# ఆన్‌లైన్ గేమింగ్‌కు మనీ లాండరింగ్ ముప్పు

## కట్టడికి తక్షణ చర్యలు తీసుకోవాలి

## ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి

## డిజిటల్ ఇండియా ఫౌండేషన్ నివేదిక

న్యూఢిల్లీ: అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశీ ఆన్‌లైన్ గేమింగ్ రంగానికి మనీలాండరింగ్ నుంచి గణనీయంగా ముప్పు పొంచి ఉందని డిజిటల్ ఇండియా ఫౌండేషన్ ఒక నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో విస్తరించిన డిజిటల్ ఎకానమీని, ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమను కాపాడేందుకు సత్వర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. చట్టవిరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఆపరేటర్లను కట్టడి చేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని, చట్టబద్ధమైన ఆపరేటర్లతో వైట్‌లిస్ట్ తయారు చేయాలని, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అడ్డుకట్ట వేయాలని, అంతర్జాతీయంగా పరస్పరం సహరించుకోవాలని పేర్కొంది. అలాగే మోసపూరిత విధానాలు పాటించే ప్లాట్‌ఫాంల జోలికి వెళ్లకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని, పటిష్టమైన ఇన్వెస్టిగేటివ్ బృందాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది.

**అయిదేళ్లలో 7.5 బిలియన్ డాలర్లకు పరిశ్రమ..**

నివేదిక ప్రకారం 2020%-% 2023 ఆర్థిక సంవత్సరాల మధ్య 28 శాతం వార్షిక వృద్ధితో భారతీయ రియల్ మనీ గేమింగ్ (ఆర్ఎంజీ) రంగం అంతర్జాతీయ మార్కెట్లో కీలక పరిశ్రమగా మారింది. వచ్చే ఐదేళ్లలో ఈ రంగం ఆదాయం 7.5 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. కోట్ల కొద్దీ గేమర్లు పరిశ్రమ వృద్ధికి దోహదపడుతున్నారు. దీనితో ఫిన్‌టెక్, క్లౌడ్ సర్వీసెస్, సైబర్%-%సెక్యూరిటీ వంటి అనుబంధ రంగాల్లో కూడా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. యూజర్‌కు భద్రత, సైబర్ సెక్యూరిటీపరమైన సవాళ్లు మొదలైనవి పరిశ్రమ పురోగతికి అవరోధాలుగా మారొచ్చు. దేశీయంగా చట్టవిరుద్ధమైన బెట్టింగ్ మార్కెట్లో ఏటా 100 బిలియన్ డాలర్ల డిపాజిట్లు వస్తుండటం ఈ సవాళ్ల

**తీవ్రతకు నిదర్శనం.**

చట్టవిరుద్ధమైన ఆపరేటర్లను కట్టడి చేసేందుకు నియంత్రణ సంస్థలు ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ మిర్రర్ సైట్స్, అక్రమ బ్రాండింగ్, అలవిగాని హామీలతో చాలా ప్లాట్‌ఫాంలు నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పర్యవేక్షణ, చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరాన్ని

ఇది తెలియజేస్తోంది.

దేశీయంగా 400 పైచిలుకు స్టార్టప్‌లు 10 కోట్ల మంది రోజువారీ ఆన్‌లైన్ గేమర్లు ఉన్నారు. వీరిలో 9 కోట్ల మంది డబ్బు చెల్లించి గేమ్స్ ఆడుతుంటారు. ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక లక్ష మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2025 నాటికి 2,50,000 ఉద్యోగాలను కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఇంతటి భారీ పరిశ్రమకు నిర్దిష్టంగా ఒక నియంత్రణ సంస్థ అంటూ లేకపోవడం, పర్యవేక్షణ.. ఏకరూప ప్రమాణాలు లేకపోవడం వంటి అంశాలు సమస్యలుగా ఉంటున్నాయి.



# రిస్కులో బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ

న్యూఢిల్లీ: రీసైక్లింగ్ వ్యవస్థలో గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ పలు రిస్కులు ఎదుర్కొంటోందని మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఆర్ఏఐ) తెలిపింది. పరిశ్రమలోకి మోసపూరిత వ్యాపార సంస్థల ఎంట్రీతో పాటు పర్యావరణంపరంగా విపత్తులు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు వివరించింది.దప్రస్తుత ధర విధానం వల్ల లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల దిగుమతులపై భారత్‌కు సుమారు 1 బిలియన్ డాలర్ల మేర విదేశీ మారకంపరంగా నష్టం వాటిల్లుతోందనే అంచనాలు ఉన్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో లిథియం రీసైక్లింగ్‌కు ఫ్లోర్ ధరను పెంచాలని, నిబంధనలు పారదర్శకంగా అమలయ్యేలా చూడాలని కేంద్రాన్ని కోరినట్లు ఎంఆర్ఏఐ వివరించింది.

# 74 శాతం తగ్గిన ఆదాయ అసమానతలు

పదేళ్లలో రూ. 5 లక్షల వరకు ఆదాయ వర్గాలపై ఎస్‌బీఐ నివేదిక

న్యూఢిల్లీ: పదేళ్ల వ్యవధిలో దేశీయంగా ఆదాయ అసమానత గణనీయంగా దిగి వచ్చింది. రూ. 5 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వారికి సంబంధించి 2013%-14, 2022-%23 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో అసమానతలు ఏకంగా 74.2 శాతం మేర తగ్గాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లోని ఎకనమిక్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2014%-%2024 అసెస్‌మెంట్ ఇయర్స్ గణాంకాలను అధ్యయనం చేసిన మీదట ఎస్‌బీఐ దీన్ని రూపొందించింది. దీని ప్రకారం ఆదాయాన్ని మెరుగుపర్చుకుంటూ పై స్థాయికి చేరుకుంటున్న అల్పాదాయ వర్గాల వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2014 ఆర్థిక సంవత్సరంలో రూ. 3.5 లక్షల వరకు ఆదాయాలున్న వారిలో 31.8 శాతంగా ఉన్న అసమానత 2021 ఆర్థిక సంవత్సరం నాటికి 12.8 శాతానికి తగ్గింది. రూ. 5.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వర్గాల సంపాదన గత దశాబ్దకాలంలో (కోవిడ్ ప్రభావిత 2020 అసెస్‌మెంట్ ఇయర్ తప్ప) ప్రతి సంవత్సరం సానుకూల రేటుతో వృద్ధి చెందింది.




# మూడేళ్లలో 10 లక్షల మంది కొన్న బైక్ ఇదే..



భారతీయ మార్కెట్లో లాంచ్ అయిన 'టీవీఎస్ రైడర్ 125' బైక్.. అమ్మకాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. సెప్టెంబర్ 2021లో లాంచ్ అయిన తరువాత మొత్తం 10,07,514 యూనిట్ల అమ్మకాలను పొందగలిగింది. మూడేళ్ళ కాలంలో ఈ బైక్ అరుదైన రికార్డ్ కైవసం చేసుకుంది.గత ఆర్థిక సంవత్సరం నాటికి టీవీఎస్ రైడర్ మొత్తం 7,87,059 యూనిట్ల అమ్మకాలను సాధించింది. ఆ తరువాత ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 2,12,941 యూనిట్ల సేల్స్ సాధించింది. మొత్తం మీద ఈ బైక్ సేల్స్ 10 లక్షల యూనిట్లు దాటేసింది. దేశీయ విఫణిలో లాంచ్ అయిన కొత్త టీవీఎస్ రైడర్ 125 బైక్ గత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా అమ్ముడైన మోటార్‌సైకిల్‌గా రికార్డ్ క్రియేట్ చేసింది. కాగా ఇటీవల ఈ బైక్ ఐజీఓ ఎడిషన్ రూపంలో రూ. 98,389 (ఎక్స్ షోరూమ్) ధర వద్ద లాంచ్ అయింది. ఇది 124.8 సీసీ ఇంజిన్ కలిగి 11.22 %దీప్త్రజూ% పవర్, 11.75 %చీఎ% టార్క్ అందిస్తుంది. చూడటానికి స్టాండర్డ్ మోడల్ మాదిరిగా అనిపించినప్పటికీ.. కొన్ని కాస్మొటిక్ అప్డేట్స్ చూడవచ్చు.

# లాంచ్‌కు సిద్ధమవుతున్న కొత్త యాపిల్ మ్యాక్‌బుక్



యాపిల్ కంపెనీ ప్రతి ఏటా కొత్త ఉత్పత్తులను లాంచ్ చేస్తుంది. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 2024లో ఐఫోన్ 16 సిరీస్ లాంచ్ చేసింది. ఇప్పుడు కంపెనీ మ్యాక్ బుక్ లాంచ్ చేయడానికి సిద్ధమవుతోంది. అయితే కంపెనీ దీనిని లాంచ్ చేయడానికి ప్రత్యేకంగా ఈవెంట్ నిర్వహించే అవకాశం లేదని సమాచారం. కాబట్టి దీనికి సంబంధించిన ప్రకటనలు ఉండవచ్చని తెలుస్తోంది.యాపిల్ మ్యాక్ ప్రకటనలు నవంబర్ 28న రానున్నట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ 'గ్రెగ్ జోస్వియాక్' తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.గ్రెగ్ జోస్వియాక్ ప్రకటనకు ముందే మ్యాక్ బుక్ లేటెస్ట్ వెర్షన్‌కు సంబంధించి కొన్ని పుకార్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది యాపిల్ ఎమ్4 చిప్ పొందనున్నట్లు తెలుస్తోంది. వచ్చే వారంలో ఐమ్యాక్, మ్యాక్ బుక్ ప్రో, మ్యాక్ మినీ వంటి కొత్త అప్‌డేట్‌లకు సంబంధించిన వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.యాపిల్ మ్యాక్ బుక్ రిఫ్రెష్ డిజైన్ కలిగి, అప్డేటెడ్ ఫీచర్స్ కూడా పొందనున్నట్లు సమాచారం. ఇందులో 10 కోర్ సీపీయూ ఉండే అవకాశం ఉంది. అయితే కంపెనీ లాంచ్ చేయనున్న ఈ కొత్త యాపిల్ మ్యాక్ బుక్‌కు సంబంధించిన వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.




# నష్టాల్లోకి ఇండిగో

న్యూఢిల్లీ: విమానయాన రంగ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024%-%25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు వెల్లడించింది. ఏడు త్రైమాసికాల తదుపరి జులై%-%సెప్టెంబర్(క్యూ2)లో లాభాలను వీడింది. రూ. 986 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అధిక ఇంధన వ్యయాలు, ఇంజిన్ సమస్యలతో కొన్ని విమానాలు నిలిచిపోవడం లాభాలను దెబ్బతీశాయి.

విదేశీ మారక ప్రభావాన్ని మినహాయిస్తే రూ. 746 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఇండిగో బ్రాండుతో సర్వీసులందిస్తున్న కంపెనీ గతేడాది(2023%-%24) ఇదే కాలంలో నికరంగా రూ. 189 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 15 శాతం పుంజుకుని రూ. 17,800 కోట్లను తాకింది. ఇంధన వ్యయాలు 13 శాతం పెరిగి రూ. 6,605 కోట్లకు చేరాయి. కొత్త బిజినెస్ క్లాస్: ఢిల్లీ-ముంబై మార్గంలో కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన బిజినెస్ క్లాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. తదుపరి దశలో 40కుపైగా విమానాలను 12 మెట్రో రూట్లలో ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. మరిన్ని విదేశీ రూట్లకు సర్వీసులను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఇండిగో ప్రస్తుతం 410 విమానాలను కలిగి ఉంది. వెరసి మొత్తం వ్యయాలు 22 శాతం పెరిగి రూ. 18,666 కోట్లను తాకాయి. 6%అధికంగా 2.78 కోట్ల ప్యాసింజర్లు ప్రయాణించగా.. టికెట్ల ఆదాయం 10 శాతం ఎగసి రూ. 14,359 కోట్లకు చేరింది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

# విద్యుత్ ఛార్జీలు రద్దుచేయండి

## ప్రజలపై భారం మోపితే సహించం

## విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ




**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** సర్దుబాటు చార్జీల ఆదేశాలను రద్దు చేయండి. స్మార్ట్ మీటర్లను ఆపండి అంటూ ? శనివారం విజయవాడ ధర్నా చౌక్ లోని విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం విజయవాడ నగర కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రూ.6072 కోట్ల రూపాయల విద్యుత్ సర్దుబాటు చార్జీలు మోపే ఆదేశాలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల కాపీలను దగ్ధం చేశారు. విద్యుత్ భారాలకు నిరసనగా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్ మాట్లాడుతూ ?. నాలుగు నెలల్లో సూపర్ సిక్స్, ఇతర హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం భారాలను మోపటంలో మాత్రం ముందున్నదన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, భారాలు తగ్గిస్తామని మాట ఇచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వాగ్దాన భంగానికి పాల్పడిందని, నమ్మకద్రోహం చేసిందని నిప్పులుచెరిగారు. రూ.6072 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజల నెత్తిన వేసిందని, మరో 11 వేల కోట్ల రూపాయలు పైగా భారం మోపటానికి సిద్ధమవుతున్నదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యుత్ ఇతర రూపాల్లో ప్రజల నెత్తిన భారాలు మోపిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించారని గుర్తు చేశారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం కూడా భారాలు మోపే దారిలోనే ప్రయాణించటం శోచనీయమన్నారు. బడా కంపెనీలకు దోచిపెట్టి భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన వైసీపీ ప్రభుత్వం అక్రమాలపై విచారణ చేసి శిక్షించాల్సింది పోయి, ఆ భారాలకు తెలుగుదేశం కూటమి ఆమోద ముద్రవేసి ప్రజలపైకి సర్దుబాటు చార్జీల పేరుతో నెట్టివేయటం దారుణమన్నారు. హిందూజా, అదాని, శిరిడీసాయి ఎలక్ట్రికల్, తదితర కంపెనీలకు బిజెపి, వైసీపీలు గతంలో దాసోహం అన్నాయని గుర్తు చేశారు. ఆ దోపిడీని అరికట్టాల్సిన తెలుగుదేశం కూటమి కార్పొరేట్ కంపెనీల దోపిడీని కొనసాగించడం గర్హనీయమన్నారు. గత ప్రభుత్వ పాపాలను అరికట్టాల్సింది పోయి, ప్రజలకు శాపాలుగా మార్చుతున్న చంద్రబాబు ప్రభుత్వ వైఖరి అమానుషమన్నారు. 2022 -23 సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్ కు నేడు ఒక్కొక్క యూనిట్ కు అదనంగా 85 పైసలు భారం మోపి, 2024 నవంబర్ నుండి 2026 జనవరి వరకు 15 నెలల పాటు వసూలు చేయాలని నిర్ణయించడం అక్రమమని మండిపడ్డారు. మరోవైపు వ్యవసాయం పంపుసెట్లకు మీటర్లను, గఅహాలకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను గతంలో వ్యతిరేకించిన తెలుగుదేశం కూటమి నేడు మీటర్లు బిగించడానికి పూనుకోవడం మోసపూరితమన్నారు. అదానీ, శిరిడీసాయి తదితర కంపెనీలకు చంద్రబాబు సర్కార్ కూడా దాసోహం అంటున్నదని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వానికి, నేడున్న తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వానికి ఈ విషయంలో ఏ తేడా కనపడటం లేదని చెప్పారు. ఇప్పటికే రెండు రకాల ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను వసూలు చేస్తున్నారనీ, మరో సర్దుబాటు చార్జీ తోడు చేయటం ప్రజలను పీల్చి పిప్పి చేయటమే అవుతుందని అన్నారు. ఒక్కొక్క యూనిట్ కి అన్ని రకాల సర్దుబాటు చార్జీలు కలిసి రెండు రూపాయల వరకు వసూలు చేయటం దారుణమన్నారు. అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు అధికమవుతున్నాయని చెప్పారు. బడా కంపెనీల దోపిడి, పాలకులు, అధికారులు అవినీతి, అసమర్థ విధానాలే ఈ భారాలకు కారణమన్నారు. దోపిడీని, అవినీతిని అరికట్టి ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాల్సిన తెలుగుదేశం అదే దోపిడీ విధానాలను కొనసాగించడం, మాట తప్పడం తగదు అని అన్నారు. 2000 సంవత్సరంలో ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజల ఆగ్రహానికి నాటి తెలుగుదేశం ప్రభుత్వం గురైంది, గద్దె దిగింది అని, వైసీపీ ప్రభుత్వం భారాలపై ప్రజల ఆగ్రహంతో ఓటమి చెందిందని గుర్తు చేశారు. గుణ పాఠాలు నేర్చుకోకుండా చంద్రబాబు ప్రభుత్వం, కేంద్రం అండతో కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవటం క్షంతవ్యం కాదు అని చెప్పారు. విద్యుత్ నియంత్రణ మండలి పేరుతో కూటమి ప్రభుత్వం కపట నాటకం ఆడుతున్నదని, ఈ భారానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యుత్ నియంత్రణ మండలి మోపిన భారాన్ని ప్రభుత్వమే భరిస్తామని ప్రకటించాలని కోరారు. ప్రజలకు ఉపశమనం కలిగించాలన్నారు. ఈ భారాలతోనే కొనసాగితే ప్రజల ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం అన్ని వర్గాల ప్రజలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఐక్య పోరాటం సాగిస్తాం, సర్దుబాటు చార్జీలుహాళ రద్దు అయ్యే వరకు ఉద్యమిస్తాం .. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు ఆపే వరకు విరామం లేకుండా పోరాడుతాం .. అని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లంగి అదాని ఇతర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయటానికి విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రమాదకర విధానాలను కొనసాగిస్తే కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు అని అన్నారు. ఇప్పటికైనా పునరాలోచించండి, భారాలు ఆపండి అని నినదించారు. 6072 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీలహాళఆదేశాలను రద్దు చేయండి. స్మార్ట్ మీటర్లను ఆపండి అని డిమాండ్ చేశారు. నేడు జరిగిన ఈ ఆందోళనలో సిపిఎం నేతలు బోయి సత్యబాబు, బి రమణరావు, పికృష్ణ, కే దుర్గారావు, టి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు ఆటలో షర్మిల ఓ బంతి

## బాబు స్క్రిప్టునే చదువుతున్న షర్మిల

## మాజీమంత్రి పెద్దిరెడ్డి ఎదురుదాడి



**కడప,(క్రైమ్ మిర్రర్):** వైఎస్సార్ కుటుంబంలో ఆస్తి పంపకాల వ్యవహారం ప్రస్తుతం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆస్తి పంపకాలకు సంబంధించి జగన్‌ను ఉద్దేశించి ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో షర్మిల వ్యాఖ్యలపై మాజీమంత్రి పెద్దిరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు స్క్రిప్ట్ నే షర్మిల చదువుతున్నారని.. ఇవన్నీ ఎన్నికల ముందు గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నించారు. ఆమె కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఆడుతున్న ఆటలో షర్మిల బంతిగా మారారన్నారు. పార్టీ బలోపేతం కన్నా జగన్‌ను రాజకీయంగా దెబ్బ తీయడమే లక్ష్యంగా షర్మిల భావిస్తున్నారని విమర్శించారు. జగన్ విద్యుత్ శాఖతో మీటింగ్ జరిగితే ఛార్జీల పెంపు కోసమే అంటూ లీకులు ఇచ్చేవారన్నారు. కరెంటు ఛార్జీలు పెంచడం కోసమే మీటింగ్ అని చెబుతారంటూ మండిపడ్డారు. జగన్ తప్పిదం వల్లే ఛార్జీలు పెంచాల్సి వచ్చిందని కూడా అంటారన్నారు. విషపూరిత ధోరణిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. రాష్టంలో ఏం జరిగినా దానికి జగనే కారణమని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వ్యవసాయం దండగా అన్న చంద్రబాబు.. రైతుల పట్ల సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నారంటూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విరుచుకుపడ్డారు.వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రతికుండగానే జగన్, షర్మిలకు సమానంగా ఆస్తి పంపకాలు చేశారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి అన్నారు. జగన్‌కు బెంగుళూరులో ఇళ్ళు ఉందని షర్మిలకు హైదరాబాద్ లోటస్ పాండ్ ఇళ్ళు ఇచ్చారని తెలిపారు. వివాహం అయిన తర్వాత షర్మిల వాటాలు తీసుకొని మళ్ళీ ఆస్తులు కోరడం సమంజసం కాదన్నారు. జగన్ సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందారని తెలిపారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు తండ్రికి దూరంగా ఉంటూ బెంగుళూరులో వ్యాపారం చేసుకున్నారన్నారు. రఘురాం సిమెంట్‌ను కొనుగోలు చేసి భారతి సిమెంట్స్‌ను ఏర్పాటు చేసుకున్నార న్నారు. షర్మిల ఆస్తుల్లో జగన్ వాటా అడగలేదని.. చెల్లి కోసం జగన్ సొంత ఆస్తుల్లో కూడా వాటా ఇచ్చారన్నారు. ఈడీ అటాచ్ చేసిన ఆస్తులు షర్మిల ట్రాన్స్ఫర్ చేసుకున్నా రని సతీష్ రెడ్డి వెల్లడించారు. ఃూగా.. ఇటీవల వైఎస్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ రాసిన విషయం తెలిసిందే.

# మహారాష్ట్ర,జార్ఖండ్ఎన్నికలకు దూరం

## ఆప్ అధినేత కేజ్రీవాల్ నిర్ణయం



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైన ఆమ్ ఆద్మీ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించిందని ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ తెలిపారు. మహా వికాస్ అఘాఢీ కూటమిలోని పార్టీలకు మద్దతుగా తమ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. మహారాష్ట్రతో పాటు ఝార్ఖండ్ విషయంలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు మద్దతుగా ఝార్ఖండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరనుండగా.. ఝార్ఖండ్‌లో 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెలువడనున్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి పోటీగా విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమి స్థాపించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో దిల్లీ, గుజరాత్, హరియాణా రాష్టాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేసింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం ఒంటరిగా బరిలోకి దిగింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంతంగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైంది. తాజాగా మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా నిలిచింది.

# 26న పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశం



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** భారత రాజ్యాంగ స్వీకరణ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక ఉమ్మడి సమావేశం జరిగే అవకాశం ఉందని శనివారం అధికారులు వెల్లడించారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ రజ్యాంగాన్ని ఆమోదించగా 1950 జనవరి 26న అది అమలులోకి వచ్చింది. సంవిధాన్ సభకు చెందిన సెంట్రల్ హాలులో లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశం నవంబర్ 26న జరిగే అవకాశం ఉంది. నవంబర్ 26వ తేదీని ఇదివరకు జాతీయ న్యాయ దినోత్సవంగా పాటించేవారు. రాజ్యాంగ విలువల గురించి ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతో నవంబర్ 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

# ప్రాణహిత నదిలో ముగ్గురు గల్లంతు

**ఆసిఫాబాద్,(క్రైమ్ మిర్రర్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహిత నదిలో ముగ్గురు గల్లంతయ్యారు. బెజ్జూరు మండలం గోల్కొండ గ్రామానికి చెందిన జహీర్ హుస్సేన్ (24), ఇర్షాద్ (20), మోసిద్ (22), కాజీమ్ అనే యువకులు శనివారం బెజ్జూర్ మండల కేంద్రంలో బంద్ ఉండటంతో సరదాగా బెజ్జూర్ మండలం ఎర్రబండ రేవు వద్ద ప్రాణహిత నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో బెజ్జూర్ ఎస్సై విక్రమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. యువకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# కాంగ్రెస్ నేతలకు పోలీసులు బానిసలు కావద్దు

## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హితవు

**వరంగల్,(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ నేతలకు పోలీసులు బానిసలు కావద్దని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పోలీసులు తమ గౌరవాన్ని కాపాడుకోవాలని హితవుపలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నేరాలు, హత్యలు పెరిగాయయని విమర్శించారు. అసలు రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉన్నారో లేదో కూడా తెలియడం లేదని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఎద్దేవా చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో లకావత్ శ్రీను ఆత్మహత్యకు కారణమైన పోలీసులను సర్వీసు నుంచి తప్పించాలని సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. దీపావళి పండుగకు ముందే తెలంగాణ పాలిటిక్స్‌లో రెండు మూడు పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకూ సత్యవతి రాథోడ్ కౌంటరిచ్చారు. కాంగ్రెస్ నేతలపైనే బాంబులు పడతాయని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌తో ఎవరి కొంపలు మునిగాయో ఇంతవరకు ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి కౌంట్‌డౌన్ మొదలైందని మాజీ స్పీకర్ మధుసూదనచారి అన్నారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ ఆఫీసుల్లా మారిపోయాయని విమర్శించారు. దుర్మార్గపు పాలనతో

# ఫిరాయింపులతో మాకు గుర్తింపు లేకుండా పోయింది

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు

**జగిత్యాల,(క్రైమ్ మిర్రర్):** ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపుల కారణంగా తనలాంటి ఒరిజినల్ కాంగ్రెస్ లీడర్లు ఆత్మస్థైర్యాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిరాయింపుల ద్వారా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతలు స్థానికంగా రెచ్చిపోతున్నారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులను గత కొంతకాలంగా వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.. తన అనుచరుడు గంగారెడ్డి హత్యతో అసమ్మతిని బహిరంగంగా వెల్లగక్కాడు. కాంగ్రెస్ పెద్దలు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినిపించుకోవడం లేదు. దీంతో ఆయన్ను బుజ్జగించేందుకు టీపీసీసీ ప్రచార కార్యదర్శి మధుయాష్కీ గౌడ్ శుక్రవారం జగిత్యాలకు వెళ్లారు. అక్కడ జీవన్ రెడ్డిని కలిసి ఆయన్ను పరామర్శించారు. అనంతరం ఇద్దరూ కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగానే జీవన్ రెడ్డి తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఫిరాయింపుల కారణంగా తమ ఆత్మస్థైర్యాన్ని కోల్పోయామని అన్నారు. తనకు చెప్ప కుండానే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లోకి వచ్చాక ఆయన రెచ్చిపోయారని అన్నారు. పార్టీ ఫిరాయింపుల కారణంగానే గంగారెడ్డిని కోల్పోవాల్సి వచ్చిందని విచారం వ్యక్తంచేశారు. మధుయాష్కీ గౌడ్ కూడా పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లోకి వస్తున్న వారు ఎవరూ కూడా పార్టీపై ప్రేమతో రావడం లేదని తెలిపారు. తమ స్వలాభం కోసం, అక్రమాస్తులను కాపాడుకోవడం కోసమే అధికార పార్టీలోకి వస్తున్నారని అన్నారు. అలా వచ్చిన వా÷-లళెవరికీ కాంగ్రెస్ సిద్ధాంతాలపై విశ్వాసం లేదని మండిపడ్డారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

# టీడీపీపై మండిపడ్డ వైసీపీ

### అన్నచెల్లెల విషయంలో టీడీపీ రాజకీయం



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** వైఎస్ కుటుంబంలో ఆస్తి తగాదాలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ వివాదంపై తన అన్న జగన్, వదిన భారతిని తీవ్ర విమర్శలు చేస్తూ వైఎస్ అభిమానులకు షర్మిల నిన్న ఒక లేఖను రాశారు. అయితే జగన్ కుటుంబంలో నెలకొన్న కుటుంబ తగాదాలను టీడీపీ రాజకీయంగా వాడుకోవడం మొదలుపెట్టింది. షర్మిల లేఖలోని ముఖ్యమైన పాయింట్లను స్క్రీన్‌షాట్స్ తీసుకుని మరీ ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో షేర్ చేసింది. అయితే దీనిపై వైసీపీ మండిపడింది. వైఎస్ కుటుంబ తగాదాలపై టీడీపీకి ఎందుకంత ఆసక్తి అని ప్రశ్నించింది. షర్మిల రాసిన లేఖను టీడీపీ తన అధికారిక ట్విట్టర్ (ఎక్స్) హ్యాండిల్‌లో బిగ్ బ్లాస్ట్ అంటూ పోస్టు చేసి ఈ గొడవను రెచ్చగొట్టి, నాణేనికి ఒకవైపే చూపించి ప్రజలను పక్కదోవ పట్టించడం వెనుక అసలు ఉద్దేశమేంటి అని వైసీపీ నిలదీసింది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి దిగాలనే లక్ష్యం కాదాంటారా అని ప్రశ్నించింది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఘోరమైన పాలనా వైఫల్యం నుంచి ఆగ్రహంతో ఉన్న ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ కాదా అని ప్రశ్నించింది. దిగజారుతున్న లా అండ్ ఆర్డర్‌తో కడతేరుతున్న ఆడబిడ్డలపై జరుగుతున్న దారుణాల నుంచి, డయేరియా మరణాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఈ తప్పుడు రాజకీయాలు కాదా అని మండిపడింది. రాజకీయంగా వైఎస్ జగన్ అంతాన్ని కోరుకుంటున్న వారితో తన వంతు పాత్ర పోషిస్తున్న ఘట్టం నేపథ్యంలో, ప్రజలకు అన్ని వాస్తవాలు తెలిసేలా వైఎస్ జగన్ తన సోదరికి రాసిన అన్ని లేఖలను, తన స్వార్జిత ఆస్తుల్లో ఇవ్వదలుచుకున్న ఆస్తుల వివరాలతో కూడిన ను కూడా వెల్లడిస్తున్నామని పేర్కొంది.



## శ్రీవారి ఆదాయం రూ. 3.78 కోట్లు

**తిరుపతి, (క్రైమ్ మిర్రర్):** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. కలియుగ ప్రత్యక్షదైవం, ఆపదమొక్కులవాడు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 5 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 56,501 మంది భక్తులు దర్శించుకోగా 21,203 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు వచ్చిందన్నారు.

## తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు

తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్ పార్క్, వైస్రాయ్ హోటల్ సహా మరో రెండు ప్రాంతాలకు తాజాగా బాంబు బెదిరింపుల మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ఆయా హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఎక్కడా పేలుడు పదార్థాలు దొరకలేదు. దీంతో వాటిని ఫేక్ మెయిల్స్‌గా పోలీసులు నిర్ధారించారు. అనంతరం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతిలో నాలుగు రోజుల క్రితం కూడా ఈ నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టారు. అప్పుడు కూడా ఫేక్ మెయిల్స్‌గా నిర్ధారించారు. దీనిపై రెండు కేసులు నమోదు చేశారు.

## బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు



**బాపట్ల, (క్రైమ్ మిర్రర్):** బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోదైంది. మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై గతేడాది దాడికి సంబంధించి నందిగం సురేశ్‌పై తుళ్లూరు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బోరుగడ్డ అనిల్ కుమార్ పేరును కూడా ఈ కేసులో చేర్చారు. ఇందులో ఏ1గా నందిగం సురేశ్, ఏ2గా బోరుగడ్డ అనిల్ పేర్లు ఉన్నాయి. గత ఏడాది మార్చి 31న అమరావతి ఉద్యమంలో భాగంగా రాజధాని గ్రామమైన మందడంలో నిర్వహించిన సమావేశానికి సత్యకుమార్ యాదవ్, మరికొందరు నేతలు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో మూడు రాజధానుల శిబిరం వద్ద అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్ అడ్డుకున్నారు. తమ అనుచరులతో కలిసి ఇసుప రాడ్లు, రాళ్లతో దాడి చేశారు. ఈ సమయంలో నందిగం సురేశ్ తన అనుచరులను రెచ్చగొట్టినట్లు బీజేపీ యువజన నాయకుడు సురేశ్ తెలిపారు. అయితే అప్పుడు వైసీపీ ప్రభుత్వం ఉండటంతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నాడు మళ్లీ ఫిర్యాదు చేశామని చెప్పారు.

## ధరల నియంత్రణపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

### మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని సర్కార్ ఏర్పాటు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై మంత్రుల కమిటీని సర్కార్ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో మంత్రుల కమిటీ ఏర్పాటైంది. కమిటీలో సభ్యులుగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ ఎక్స్అఫీషియో కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం పేర్కొంది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకస్మికంగా ఎందుకు పెరుగుతున్నాయన్న అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నిత్యావసరాలు, కూరగాయల ధరల తగ్గింపునకు చేపట్టాల్సిన చర్యలపైనా సిఫార్సులు చేయాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఉత్పత్తి, సప్లై, డిమాండ్ , ధరలకు సంబంధించిన అంశాలు, పంటల తీరు, ఎగుమతులు, దిగుమతులపై కూడా అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశించింది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో నిత్యావసరాలు, కూరగాయలు లభించేలా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని తెలిపింది. ధరలు నియంత్రణలోకి తెచ్చేందుకు అవసరమైన యంత్రాంగం రూపకల్పనకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ అంశాలపై ఓ డేటా బేస్‌ను ఏర్పాటు చేయాలని ఆర్డర్స్ వేసింది. ధరలు పెరిగినప్పుడు మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను అమలు చేసేలా శాశ్వత ప్రాతిపదికన ధరల నియంత్రణ నిధిని ఏర్పాటు చేసేందుకు సూచనలు ఇవ్వాలని వెల్లడించింది. ధరల పెరుగుదల , నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్లపై అధికారుల కమిటీ ఇచ్చిన సిఫార్సులను అధ్యయనం చేయాలని సూచించింది. ఆహార పంటలు, నిత్యావసరాలకు సంబంధించి ఉత్పత్తి, సరఫరా, నిల్వలకు సంబంధించి దీర్ఘ, స్వల్పకాలిక ప్రణాళికల అమలుపైనా ప్రభుత్వం సిఫార్సులు కోరింది. ఉత్పత్తి, నిల్వల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా ఏడాది పొడవునా ధరల్ని నియంత్రణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

# నాలుగు గంటల్లోనే హైదరాబాద్ టు విశాఖపట్నం



**విశాఖపట్నం, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే ఎంత సమయం పడుతుంది? సాధారణ రైళ్లలో వెళ్తే 12 గంటలు.. అదే వందేభారత్ రైలులో అయితే 8.30 గంటల్లోనే వెళ్లొచ్చు. కానీ అదే నాలుగు గంటల్లోనే హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లగలిగితే ఎలా ఉంటుంది.. అతి త్వరలోనే ఆ కోరిక తీరబోతుంది. హైదరాబాద్ నుంచి వైజాగ్ మధ్య రైలు ప్రయాణ సమయాన్ని తగ్గించే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళిక కీలక దశకు చేరుకుంది. ఈ మేరకు శంషాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు ప్రస్తుతం రెండు మార్గాల్లో రైళ్లు వెళు తున్నాయి. మొదటిది వరంగల్-ఖమ్మం-విజయవాడ మార్గం. రెండోది నల్గొండ-గుంటూరు-విజయవాడ. ఈ రెండు మార్గాల్లో గంటకు 110 నుంచి 130 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణిస్తున్నాయి. కానీ గంటకు 220కి.మీ. వేగంతో రైల్లు ప్రయాణించేలా ఇప్పుడు కొత్త మార్గాలను రైల్వే శాఖ ప్రతిపాదించింది. ఇందులో ఒకటి హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిని అనుకుని ఉన్నట్లుగానే ఉంటుంది. దీన్ని సూర్యాపేట, విజయవాడ మీదుగా మొదటి మార్గాన్ని ప్రతిపాదించింది. ఇందులో భాగంగా వైజాగ్ నుంచి విజయవాడ, సూర్యాపేట మీదుగా కర్నూలుకు మరో కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇది వైజాగ్ నుంచి మొదలై సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూలు మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి ప్రిలిమినరీ ఇంజనీరింగ్, ట్రాఫిక్ (పెట్) సర్వే తుది దశకు చేరింది. ఈ సర్వే నివేదికను నవంబరులో రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంలో శంషాబాద్, రాజమండ్రి విమానాశ్రయాలకు అనుసంధానించేలా ఈ ప్రణాళికను రూపొందించడం విశేషం. విమాన ప్రయాణికులు అతి తొందరగా స్వస్థలాలకు వెళ్లేలా ఈ సెమీ హైస్పీడ్ రైళ్ల ప్రణాళికను రూపొందించింది.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాటు చేయాలి


### ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. నవంబర్ 6వ తేదీ లోగా ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.."ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 70 నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించేందుకు కూటమి శ్రేణులు కృషి చేయాలి. ప్రభుత్వం అందించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ నేతలంతా కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి. సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ మనదే విజయం కావాలి. ఇందుకు ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడినట్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ చెమట చిందించాలి. ఏపీలో ఉచిత ఇసుక సరఫరా చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. పదకొండు బోట్స్‌మెన్ సొసైటీల్లో పూర్తిస్థాయిలో ఇసుక అందుబాటులోకి తీసుకువస్తాం. ఉచిత ఇసుక పంపిణీలో స్థానిక నేతలెవరూ జోక్యం చేసుకోవద్దు. ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడే నేతలపై కఠిన చర్యలు ఉంటాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు కమిషన్ల కోసం కక్కుర్తి పడ్డారు. విద్యుత్‌ను అధిక రేట్లకు కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు టీడీపీ కార్యకర్తలకు అండగా నిలబడ్డారు. వారి శ్రేయస్సు కోసం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేవలం రూ.100 కడితే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకూ ప్రమాద బీమా అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సైతం విజయవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మందితో సభ్యత్వం చేయించే దిశగా కష్టపడాలి" అని చెప్పారు.

# 175 నియోజకవర్గాల్లో ఒకేసారి టీడీపీ సభ్యత్వాలు

### మంగళగిరిలోని ప్రారంభించిన ఏపీ సీఎం చంద్రబాబు



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒకేసారి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ అధినేత ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునః ప్రారంభించారు. సభ్యత్వ నమోదులో భాగంగా పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రూ.100 కట్టి సీఎం చేతుల మీదుగా మొదటి సభ్యత్వాన్ని తీసుకున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలని శుక్రవారం నాడు సీఎం చంద్రబాబు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వందల, వేల మంది కార్యకర్తల కృషి ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టీడీపీ పార్టీ సేవలు అందించగలుగుతుందని అన్నారు. ఆపద సమయంలో వారిని ఏ విధంగా ఆదుకుంటామో చేసి చూపిస్తామని సీఎం చెప్పారు. పార్టీ కోసం అనేక మంది కార్యకర్తలు, నేతలు వివిధ స్థాయిల్లో కష్టపడి పని చేశారని ఆయన చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పోరాడి అనేక కేసులు పెట్టించుకున్నారని, జైలుకు వెళ్లారని, ఆస్తులు పోగొట్టుకున్నారని చంద్రబాబు తెలిపారు. అలాంటి వారికి కచ్చితంగా టీడీపీ పార్టీ అండగా నిలబడుతుందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన పలువురు కార్యకర్తలతో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. గతంలో ఇన్స్యూరెన్స్ రాని 73 మందికి రూ.2లక్షల చొప్పున చంద్రబాబు అందించారు. ఈ మేరకు నేడు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. రూ.100లు కట్టి సభ్యత్వం తీసుకుంచే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ప్రమాద బీమా వర్తిస్తుంది. రూ.లక్ష కడితే పార్టీలో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. ప్రమాదవశాత్తూ చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు తక్షణసాయం అందజేస్తారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం ఆర్థికసాయం అందిస్తారు. మరోవైపు కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూ.లక్ష కట్టి మంత్రి భరత్ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## అమెరికాకు చేరుకున్న నారాలోకేశ్

### పెట్టుబడులే లక్ష్యంగా పర్యటన




**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎయిర్‌పోర్టులో ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. ఏపీలో ఎన్డీఏ కూటమి "అఖండ" విజయం సాధించిన తర్వాత తొలిసారిగా అమెరికాలో లోకేష్ పర్యటిస్తున్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగనుంది. ఈనెల 29న లాస్ వేగాస్ నగరంలో జరుగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు మంత్రి హాజరుకానున్నారు. 31న అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొననున్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వై2కె బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను మంత్రి వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయని , పరిపాలనలో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నేతృత్వంలో యువనాయకత్వం చురుగ్గా పనిచేస్తోందన్నారు. మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారని.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

## అందుకే జ్యోతిర్లింగాలను సందర్శించాం: మంచు విష్ణు



"పరమ శివుడి పరమ భక్తుడి కథగా రూపొందిన చిత్రం 'కన్నప్ప'. అందుకే ఈ చిత్రం విడుదలకు ముందే 12 జ్యోతిర్లింగాలను సందర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కేదార్‌నాథ్, బద్రీనాథ్, రిషికేష్‌కు రావడం ఆనందంగా ఉంది. మా ఎపిక్ యాక్షన్ చిత్రమైన 'కన్నప్ప' విడుదల కోసం యూనిట్ అంతా ఎదురుచూస్తున్నాం" అని హీరో మంచు విష్ణు అన్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మంచు విష్ణు హీరోగా రూపొందిన చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా 'కన్నప్ప' చిత్రయూనిట్ పన్నెండు జ్యోతిర్లింగాల సందర్శన యాత్రను చేపట్టింది. రిషికేశ్ సందర్శనతో వారి ప్రయాణం ముగిసింది. ఈ యాత్రలో మోహన్‌బాబు, విష్ణు, ముఖేష్ కుమార్ సింగ్, నటుడు అర్పిత్ రంకా పాల్గొన్నారు. "ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' వంటి ఇతిహాసాల స్ఫూర్తితో 'కన్నప్ప' రూపొందింది. భక్తి, శౌర్యం, ఆధ్యాత్మిక అన్వేషణతో కూడిన ప్రయాణంగా ఈ మూవీ ఉంటుంది" అని మేకర్స్ పేర్కొన్నారు.



## మల్లయుద్ధ యోధునిగా రామ్‌చరణ్

రామ్‌చరణ్ 'గేమ్‌చేంజర్' సంక్రాంతికి విడుదల కానుంది. సినిమా ప్రమోషన్స్‌ని కూడా నిర్మాత దిల్‌రాజు మొదలుపెట్టారు. ఈ సినిమాకు సంబంధించిన తన వర్క్‌నంతా రామ్‌చరణ్ పూర్తి చేసుకున్నారు. ఇక ప్రమోషన్స్‌కి కొన్ని రోజులు కేటాయిస్తే సరిపోతుంది. ప్రస్తుతం రామ్‌చరణ్ దృష్టి అంతా బుచ్చిబాబు సాన సినిమాపైనే. శ్రీకాకుళం నేపథ్యంలో సాగే స్పోర్ట్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనున్నది. ఇందులో చరణ్ మల్లయుద్ధ వీరుడిగా కనిపిస్తాడని సమాచారం. మల్లయుద్ధం అనగానే గుర్తొచ్చే పేరు కోడి రామమూర్తి. ఉత్తరాంధ్రకు చెందిన ఈ యోధుడి జీవితమే ప్రేరణగా బుచ్చిబాబు కథ రాసుకున్నారట. జాన్వీ కపూర్ కథానాయికగా నటించనున్నది. ఏఆర్ రెహ్మాన్ సంగీత దర్శకత్వంలో ఇప్పటికే మూడు పాటలను రికార్డ్ చేశారు. డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో సినిమా సెట్స్‌కి వెళ్లనున్నట్టు సమాచారం. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## చాలా బాధ పడ్డాను..

ఆ వీడియోను ట్రోల్ చేసి నా ఆత్మాభిమానాన్ని దెబ్బతీయాలని చూశారు: సాయిపల్లవి



సాయిపల్లవి అనగానే.. సంప్రదాయబద్ధమైన భారతీయ స్త్రీ గుర్తొస్తుంది. తను వేడుకల్లోనే కాదు, సినిమాల్లోనూ వేషధారణ విషయంలో ఎక్కడా పరిధులు దాటలేదు. సాయిపల్లవి నటించిన 'అమరన్' సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నది సాయిపల్లవి. 'మెడిసన్ చేయడానికి జార్జియా వెళ్లి అక్కడ టాంగో డ్యాన్స్ నేర్చుకున్నా. ఆ డ్యాన్స్‌కి ప్రత్యేకమైన కాస్ట్యూమ్స్ ఉంటాయి. నాట్యధర్మానికి అనుగుణంగా అవి ధరించి చేస్తేనే ఆ నాట్యానికి అందం. అందుకే.. వాటిని ధరించక తప్పలేదు. అది కూడా నేను సౌకర్యంగా ఫీలయ్యాకే ఆ కాస్ట్యూమ్స్ ధరించా. స్టేజ్‌పై ప్రదర్శన కూడా ఇచ్చా. కొంతకాలానికి 'ప్రేమమ్'లో అవకాశం రావడం నటిగా బిజీ అయిపోవడం జరిగిపోయింది. కానీ ఉన్నట్టుండి జార్జియాలో నేను చేసిన టాంగో డ్యాన్స్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో ట్రోల్ అవ్వడం మొదలైంది. పైగా దాని కింద అసభ్యకరమైన కామెంట్లు. నిజంగా చాలా బాధ అనిపించింది. శరీరం కనిపించేలా దుస్తులు వేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. నటిగా మారాక అది ఒక నియమంలా పెట్టుకున్నాను. నా నియమాన్ని గౌరవించిన వారి సినిమాలే చేస్తున్నా. డ్యాన్స్ మీద ప్రేమతో చదుకునే రోజుల్లో చేసిన డ్యాన్స్ వీడియో అది. దానిని ట్రోల్ చేసి, నా ఆత్మాభిమానాన్ని దెబ్బతీయాలని చూశారు' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి.

## 'జాతర'లో ప్రేమకథ



స్వీయ దర్శకత్వంలో సతీష‌బాబు రాటకొండ హీరోగా నటిస్తున్న చిత్రం 'జాతర'. రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మాతలు. నవంబర్ 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సతీష్‌బాబు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చిత్తూరు జిల్లా జాతర నేపథ్యంలో భావోద్వేగభరితమైన కథాంశంతో ఆకట్టుకుంటుంది. యాక్షన్ సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయి' అని చెప్పారు. దీయారాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కె.వి.ప్రసాద్, సంగీతం: శ్రీజిత్ ఎడవణ, రచన-దర్శకత్వం: సతీష్‌బాబు.



## వరుస సినిమాలతో దూసుకెళ్తున్న మీనాక్షి చౌదరి..

### ఈ సారి శింబుకు జోడీగా!

హీరోయిన్ మీనాక్షి చౌదరి కెరీర్ జెట్ స్పీడ్‌తో దూసుకెళుతోంది. ఇప్పటికే ఈ బ్యూటీ నటించిన 'గుంటూరు కారం, సింగపూర్ సెలూన్, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' చిత్రాలు రిలీజ్ అయ్యాయి. మీనాక్షి నటించిన ఇతర చిత్రాలు 'లక్కీ భాస్కర్, మెకానిక్ రాకీ, మట్కా' కూడా ఈ ఏడాదిలోనే రిలీజ్‌కు ముస్తాబు అవుతున్నాయి. ఇక తాను హీరోయిన్‌గా కమిటైన సినిమాల చిత్రీకరణలు దాదాపు పూర్తి కావడంతో మీనాక్షి చౌదరి కొత్త సినిమాలు సైన్ చేసేందుకు కథలు వింటున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల దర్శకుడు అశ్వత్ మారిముత్తు చెప్పిన కథ విన్నారట మీనాక్షి. కథ నచ్చడంతో శింబు హీరోగా నటించనున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించేందుకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. అలాగే చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర'లో కూడా మీనాక్షి చౌదరి ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో త్రిష వీ ా రో ం ు ు న్ గా కనిపిస్తారు.

## కొత్త ప్రపంచాన్ని చూస్తారు

'చాలా కొత్త కంటెంట్‌తో 'క' సినిమా చేశాను. ఫస్ట్‌సీన్ నుంచి లాస్ట్ సీన్ వరకూ సినిమా కొత్తగా ఉంటుంది. స్క్రీన్‌ప్లే యూనిక్‌గా ఉంటుంది. 'క'లో ఓ కొత్త ప్రపంచాన్ని చూస్తారు. ఇందులో సీజీ వర్క్‌కు కూడా చాలా ప్రాధాన్యత ఉంది. ఈ సినిమా బాగా రావడానికి కారణం అద్భుతమైన టీమ్ కుదరడమే. దీపావళికి మిమ్మల్ని బాగా ఎంటైర్టైన్ చేసే సినిమా 'క'.' అని హీరో కిరణ్ అబ్బవరం నమ్మకంతో చెప్పారు. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీరామ్ కథానాయికలు. సుజీత్, సందీప్ కలిసి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడారు. ఓ కొత్త అనుభూతిని కలిగించే సినిమా ఇదని, ఇందులో కిరణ్ కొత్తగా కనిపిస్తాడని దర్శకులు చెప్పారు. ఇందులో సత్యభామ అనే బ్యూటిఫుల్ రోల్ చేశానని కథానాయిక నయన్ సారిక అన్నారు. ట్రైలర్‌కి వందరెట్లు గొప్పగా సినిమా ఉంటుందని, కుటుంబసమేతంగా చూడదగ్గ సినిమా ఇదని నిర్మాత పేర్కొన్నారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.